
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 3 కృష్ణా జిల్లా వార్తలు

బుధవారం 16 జూలై 2025





తన నివాసంలో కరారి ఈశ్వర్‌కుమార్, ఇతర బీసీ నాయకులతో సమావేశమైన కొడాలి నాని

కుల కుట్రల రాజకీయం!

గుడివాడలో 'కుల' రాజకీయాలు మొదలయ్యాయి. బలహీనవర్గాలను రెచ్చగొట్టేందుకు మాజీ మంత్రులు కొడాలి నాని, పేర్ని నాని కుట్ర రాజకీయాలకు దిగారు. మాజీ మంత్రి కరారి ఈశ్వర్ కుమార్‌ను తెరపైకి తెచ్చారు. బీసీ మహిళపై టీడీపీ దాడి చేసిందంటూ ఆరోపణలు గుప్పించిన ఆయన, యాదవ సంఘం జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికకు అండగా ఉంటుందని ప్రకటించారు. బలహీన వర్గాలపై దాడులు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఇన్నాళ్లూ తటస్థంగా ఉన్న ఆయన సడెన్‌గా ఎంట్రీ ఇవ్వడం వెనుక లోపాయకారి ఒప్పందం ఉందని ప్రచారం జరుగుతోంది. స్థానికంగా తెలుగుదేశం పార్టీలో ముసలం సృష్టించేందుకు దుష్ట పన్నాగాలు ఆరంభించారని తెలుస్తోంది.

గుడివాడ నియోజకవర్గంలో బీసీలను రెచ్చగొట్టేందుకు నానీల కుతంత్రం

మాజీ మంత్రి కరారి ఈశ్వర్ కుమార్‌ను తెరపైకి తెచ్చి రాజకీయం

- కొడాలి నానిని కలిసి మద్దతు ప్రకటించిన ఈశ్వర్‌కుమార్
- బీసీ మహిళపై టీడీపీ దాడి అంటూ ప్రెస్‌మీట్ పెట్టి ఆరోపణలు
- జెడ్పీ చైర్‌పర్సన్ హారికకు యాదవ సంఘం మద్దతిస్తుందని ప్రకటన
- టీడీపీలో ముసలం సృష్టించేందుకు మరిన్ని క్షుద్ర రాజకీయాలు

విజయవాడ, జూలై 15 (ఆంధ్రజ్యోతి): గుడివాడలో నీచమైన రాజకీయాలకు మాజీ మంత్రులు కొడాలి నాని, పేర్ని నాని ఒడిగట్టారు. బలహీనవర్గాలలో గౌడ సామాజిక వర్గానికి చెందిన కృష్ణాజిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికపై గుడివాడలో భౌతికంగా ఎలాంటి దాడి జరగలేదు. కానీ జెడ్పీ చైర్‌పర్సన్ భర్త ఉప్పాల రాము బూతు పురాణంతోనే వివాదం రేగింది. అతనిపై కూడా ఏ టీడీపీ కార్యకర్త దాడి చేయలేదు. కానీ, బీసీ మహిళపై దాడి జరిగిపోయిందంటూ కొత్త నాటకానికి తెరతీశారు. ఈ నాటకానికి సాక్ష్యాలుగా పలు వీడియోలు వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా గుడివాడలో బలంగా ఉన్న తెలుగుదేశం పార్టీని బలహీనపరచటం కోసం నానీలు సరికొత్త రొచ్చు రాజకీయానికి దిగారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన మాజీ మంత్రి కరారి ఈశ్వర్ కుమార్‌ను తెర మీద పెట్టి బలహీనవర్గాలకు అన్యాయం జరిగిపోతుందన్న ప్రచారానికి మంగళవారం దిగారు. పెడనలో జరిగిన 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ' సమావేశం తర్వాత పేర్ని నాని, కొడాలి నాని అంతరంగిక సమాలోచనలు జరిపారు.

ప్రీ ప్లాన్డ్‌గా కరారి ఎంట్రీ!

గుడివాడలో ఒకప్పుడు కొడాలి నానికి ప్రత్యర్థిగా పోటీ చేసిన కరారి ఈశ్వర్‌కుమార్‌ను రంగంలోకి దించారు. ఏం మంత్రాంగం చేశారో తెలియదు కానీ, కరారి ఈశ్వర్ కుమార్ గుడివాడలో ప్రవేశం కూడా నానీల వ్యూహం ప్రకారమే జరిగినట్టుగా తెలుస్తోంది. గుడివాడలోకి కరారి ఈశ్వర్‌కుమార్ ఎంట్రీ కూడా మిగతా 4లో..

కోవర్టులతో కుతంత్రాలు

గుడివాడ నియోజకవర్గంలో బలంగా ఉన్న టీడీపీలో ముసలం సృష్టించే పన్నాగాలకు కొడాలి నాని తెర వెనుక శ్రీకారం చుట్టారు. ఈ వ్యవహారాలపై టీడీపీ అధిష్ఠానం కూడా అప్రమత్తం కావాల్సిన అవసరం ఉంది. టీడీపీలోని రావి వెంకటేశ్వరరావు, పిన్నమనేని వెంకటేశ్వరరావు వర్గాలతో కొడాలి నాని మంతనాలు సాగిస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. దీనికి ఎక్కడో ఒకచోట అధిష్ఠానం ఫుల్‌స్టాప్ పెట్టకపోతే పార్టీకి నష్టం కలిగే ప్రమాదం ఉంది. గతంలో కొడాలి నాని దగ్గర పనిచేసిన కడియాల గణేష్, పొట్లూరి రవి వంటి వారు ప్రస్తుతం గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాముకు అత్యంత సన్నిహితులుగా ఉంటున్నారు. ఒకప్పుడు వీరు నానికి అత్యంత ఆప్తులు. ఇప్పుడు కూడా నానికి ఆప్తులే అన్న ప్రచారం ఉంది. గుడివాడ ఎమ్మెల్యే కార్యాలయంలో కానీ, తెలుగుదేశం పార్టీలో కానీ జరిగే పరిణామాలన్నీ ఎప్పటికప్పుడు నానికి తెలిసిపోతాయని సమాచారం. తన కోవర్టులు అనేకమందిని రహస్యంగా ఉంచి టీడీపీలో ముసలం సృష్టించే ప్రయత్నాలు చేస్తుండటం కూడా ఆ పార్టీ నేతలకు ఆందోళన కలిగించే విషయం. ఒక వైపు కులాల కుంపట్లు, మరో వైపు టీడీపీలో ముసలం సృష్టించే కార్యక్రమాలకు కొడాలి నాని పరోక్షంగా తెరతీసినట్టు సమాచారం.



కొడాలి నానిని హత్తుకుని మద్దతు ప్రకటిస్తున్న మాజీ మంత్రి కరారి ఈశ్వర్ కుమార్

కన్సల్టెన్సీల కహానీలు

శిక్షణ, ఉపాధి పేరుతో బెజవాడలో వెలుస్తున్న కన్సల్టెన్సీలు

అభ్యర్థుల నుంచి రూ.లక్షల వసూలు

- తూతూమంత్రంగా శిక్షణ.. ఉపాధి చూపకుండా దాటవేత
- పోలీసులను ఆశ్రయిస్తున్న బాధితులు
- పలుకుబడితో ముందుకు సాగని దర్యాప్తు



వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తామని ఓ వ్యక్తి విజయవాడలో కన్సల్టెన్సీని ప్రారంభించాడు. ఆ సంస్థలో శిక్షణ పూర్తి చేసుకుని అభ్యర్థులు బయటకు వస్తున్నారు తప్ప ఉపాధి మాత్రం దొరకడంలేదు. కొద్దినెలలుగా అభ్యర్థులు దీనిపై గొడవ చేస్తున్నారు. ఉపాధి కల్పించలేనప్పుడు చెల్లించిన డబ్బులను వెనక్కి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. పలువురు బాధితులు పోలీసులను ఆశ్రయించడంతో కన్సల్టెన్సీ యజమానిని పోలీసులు పిలిపించి విచారించారు. ఉత్తరాదికి చెందిన మరో కన్సల్టెన్సీకి ఉపాధి నిమిత్తం డబ్బులు చెల్లించానని వివరించాడు. పోలీసులు ఆ కన్సల్టెన్సీ సంస్థపై కేసు నమోదు చేశారు. అప్పటికే మోసం జరిగిందని తెలిసినా విజయవాడలో కన్సల్టెన్సీని నిర్వహిస్తున్న వ్యక్తి మాత్రం అభ్యర్థుల నుంచి డబ్బులు వసూలు చేయడం ఆపలేదు. బాధితులు ఇప్పటికీ ఆ కన్సల్టెన్సీ అధినేత చుట్టూ తిరుగుతున్నా న్యాయం మాత్రం జరగడం లేదు.



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): నగరంలోని ఎంజీ రోడ్డులో ఓ వ్యక్తి ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీని ప్రారంభించాడు. ఆన్‌లైన్‌లో తరగతులు నిర్వహించి ప్రఖ్యాత పేరు ప్రతిష్ఠలు ఉన్న యూనివర్సిటీల నుంచి పట్టాలు ఇప్పిస్తామని చెప్పాడు. చెప్పినట్టుగానే ఆన్‌లైన్‌లో తరగతులు నిర్వహించి కోర్సు కాలాన్ని పూర్తి చేశాడు. దఫదఫాలుగా రూ.లక్షలు వసూలు చేశాడు. పరీక్షలు నిర్వహించి తర్వాత నకిలీ ధ్రువీకరణపత్రాలు జారీ చేశాడు. విషయం బయటకు పొక్కేసరికి బోర్డు తిప్పేశాడు. దీంతో ఇందులో చేరిన అభ్యర్థులు లబోదిబోమన్నారు. విజయవాడలో జాబ్ కన్సల్టెన్సీలు చేస్తున్న నిర్వాకాలకు ఇది ప్రత్యక్ష ఉదాహరణ. ఆర్థిక అవసరాలు తీర్చుకోవడానికి నిరుద్యోగులు ఏదో ఒక మిగతా 4లో..

బిడ్డా ఏమైపోయావ్..

- నాలుగు రోజులైంది నిన్నుచూసి!
- దొరకని నిదీష్ జాడ.. తల్లడిల్లుతోన్న తల్లి

4

విద్యా అవస్థ!

కొత్తగా మోడల్ ప్రైమరీ పాఠశాలల విధానం అమలు

మ్యాపింగ్ ఆధారంగా 1-5 తరగతులకు ఐదుగురు టీచర్ల నియామకం

- 60 మంది విద్యార్థులు ఉండాలని నిబంధన
- కొన్ని పాఠశాలల్లో 30 కూడా దాటని సంఖ్య
- విద్యార్థుల సంఖ్య పెంచాలని ఇప్పుడు టీచర్లపై ఒత్తిడి
- పాఠశాలలు తెరిచి నెల దాటడంతో ఎక్కడ దొరుకుతారని ఆందోళన



శిక్షణ కార్యక్రమంలో ఉపాధ్యాయులు


జిల్లాలో విద్యాశాఖ తీరు నేల విడిచి సాము చేస్తున్నట్టుగా తయారైందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గ్రామాల్లో బడిఈడు పిల్లల ఆధారంగా మోడల్ ప్రైమరీ పాఠశాలలను మ్యాపింగ్ చేసిన అధికారులు ఒకటి నుంచి ఐదు తరగతులకు ఐదుగురు టీచర్‌లను నియమించారు. పాఠశాలలో 60 మంది విద్యార్థులు ఉండాలని నిబంధన పెట్టడం, 30 మంది కూడా ఉండకపోవడం ఉపాధ్యాయులకు తలనొప్పిగా మారింది. పిల్లల సంఖ్య పెంచాల్సిందేనని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో ఇప్పుడు వారిని ఎక్కడ నుంచి తేవాలంటూ తలలు పట్టుకుంటున్నారు. ఈలోపు శిక్షణ తరగతులు పెట్టడంతో పాఠశాలల్లో పాఠ్యాంశాల బోధన ఇంకా ఆరంభం కాలేదని విమర్శలు వస్తున్నాయి.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : నూతన విద్యా విధానంలో పాఠశాలలను క్రమబద్ధీకరించేందుకు ఈ ఏడాది విద్యాశాఖలో పలు మార్పులు చేశారు. దీనికి ముందు ఆయా గ్రామాల్లో బడిఈడు పిల్లల సంఖ్యను ఆధారంగా చేసుకుని కొన్ని పాఠశాలలను మ్యాపింగ్ చేశారు. ఒకటి నుంచి 5వ తరగతి వరకు 60 మంది పిల్లలు ఉండేలా మోడల్ ప్రైమరీ పాఠశాలలను మ్యాపింగ్ చేశారు. ఈ పాఠశాలల్లో ఒకటి మిగతా 4లో..

సాగునీటి సమస్య రానీయవద్దు

అధికారులకు కలెక్టర్ బాలాజీ ఆదేశం

నీటి పారుదలశాఖపై సమీక్ష



నీటి పారుదలశాఖ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాగు నీటి సమస్యను రానీయవద్దని కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ చాంబరులో మంగళవారం నీటి పారుదలశాఖ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి రైతులు సాగునీరు అందడం లేదని, వరి ఎండిపోతోందని తన దృష్టికి తీసుకువస్తున్నారని తెలిపారు. పంట కాలువలకు పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేయడంలేదని అంటున్నారని చెప్పారు. చివరి ఆయకట్టు వరకు సాగునీటిని విడుదల చేసేందుకు పక్కా ప్రణాళికను రూపొందించాలని సూచించారు. పంట కాలువల వెంబడి అధికారులు తిరిగి, సమస్య ఎక్కడ ఉందో మిగతా 4లో..

పేర్ని నాని.. నోరు అదుపులో పెట్టుకో!

- మంత్రి కొల్లు రవీంద్ర

4

బిడ్డా ఏమై పోయావ్..

నాలుగు రోజులైంది నిన్నుచూసి!

» దొరకని నిదీష్ జాడ.. తల్లడిల్లుతోన్న తల్లి



తోట్లవల్లూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : బిడ్డా ఏమై పోయావ్.. నాలుగు రోజులైంది నినుచూసి.. అంటూ నిదీష్ తల్లి కన్నీరు మున్నీరవుతోంది. ఎవరైనా బిడ్డ సమాచారం చెబుతారని నిద్రహారాలు మాని దిక్కులు చూస్తోంది. కాని నిదీష్ జాడ ఎక్కడా లభించక, తల్లికి ఏం చెప్పాలో తెలియక కుటంబసభ్యులు తల్లడిల్లిపోతున్నారు. పామర్రు మండలం నిమ్మకూరు గ్రామ సర్పంచ్ వడమట దుర్గా శ్రీనివాసరావు కొడుకు నిదీష్(10), కుమార్తె రూప నిరేహలను గత శనివారం మేనమామ వీరంకి బాలకృష్ణ తోట్లవల్లూరు మండల రొయ్యూరులోని అమ్మమ్మ ఇంటికి తీసుకువచ్చాడు. మధ్యాహ్నం 1గంటకు రొయ్యూరుకు తీసుకు రాగా సాయంత్రం 4.45 గంటలకు అదృశ్యమైనట్టు చెబుతున్నారు. నిదీష్ ఏమయ్యాడనేది అంతుచిక్కకుండా ఉంది. కాలువ పక్కనే ఇల్లు కావటంతో కాలుజారి పడి ఉండవచ్చన్న అనుమానంతో సోమవారం నుంచి మంగళవారం వరకు ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది కోడూరు వరకు విస్తృతంగా గాలించినా ఫలితం దక్కలేదు. నాలుగు రోజులైనా జాడ లభించకపోవటంతో కిడ్నాప్ జరిగి ఉండవచ్చన్న అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. రొయ్యూరులో నిదీష్‌ని కిడ్నాప్ చేసే శతృవులు లేరని బంధువులు పోలీసులకు తెలిపారు. తమకు ఎవరిపైనా అనుమానం లేదని స్పష్టం చేశారు. ఎక్కడికైనా వెళితే ఈ పాటికే బాలుడి సమాచారం లభించేది. పోని నిమ్మకూరులో నిదీష్ తండ్రి దుర్గా శ్రీనివాసరావు సర్పంచ్‌గా ఉన్నారు. ఆయనతో రాజకీయ విభేదాలుంటే రొయ్యూరు వచ్చి బాలుడుని ఏదైనా చేసే సాహసం చేయటం దుర్లభమని అంటున్నారు. పోలీసులు ఎన్ని కోణాల్లో ఆలోచించినా నిదీష్ జాడ కనిపెట్టలేకపోయారు. పోలీసులకు సవాల్‌గా మారింది. ఒక్కగానొక్క కొడుకు ఆచూకీ కోసం తల్లిదండ్రులు నాలుగు రోజులుగా రొయ్యూరులో ఎదురు చూస్తుంటే.. బంధువులు వారిని ఓదార్చుతున్నారు.

జై జగన్ అనలేదని..

» యువకుడి నుంచి మూడు వేలు స్వాహా

» పెనమలూరులో ఘటన

పెనమలూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ సైకోల పిచ్చి పరాకాష్టకు చేరుకుంటోందనడానికి పెనమలూరులో జరిగిన ఘటనే ఉదాహరణ. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెనమలూరుకు చెందిన ఎ.రమేష్‌ను అదే గ్రామానికి చెందిన గంగాధర్, అతడి స్నేహితుడు బొర్రా వెంకట్‌లు ఈనెల 13న రాత్రి పొద్దుపోయిన తర్వాత 11గంటలకు పెనమలూరు సెంటర్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్దకు తీసుకెళ్లి జై జగన్ అని చెప్పమన్నారు. దానికి రమేష్ నిరాకరించడంతో అతడిపై ఇద్దరూ తీవ్రంగా దాడిచేసి అతడి ఫోన్‌పే ద్వారా రూ.3వేలు వారి ఖాతాకు మళ్లించుకున్నారు. ఎవరికైనా చెబితే చంపేస్తామని భయపెట్టారు. వారి దాడిలో గాయపడిన రమేష్ చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేరాడు. రమేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు.

కానిస్టేబుల్ ఆత్మహత్యాయత్నం!

తిరువూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ఎ.కొండూరు స్టేషన్ కానిస్టేబుల్ కాంతారావు మంగళవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కొకిలంపాడు రోడ్డులోని ఒక వెంచర్‌లో అపస్మారక స్థితిలో పడి ఉన్న కాంతారావును గుర్తించిన కొందరు స్థానిక స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పురుగు మందు తాగిఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. ఆతడ్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం విజయవాడకు తరలించారు. స్థానిక స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కాంతారావు సాధారణ బదిలీల్లో భాగంగా ఇటీవల ఎ.కొండూరు స్టేషన్‌కు బదిలీ అయ్యాడు.



జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ శివనాథ్ తదితరులు

18న జాబ్ మేళా

వన్‌టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : కేశినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 18న మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ సైన్స్ కాలేజీ ఆవరణలో నిర్వహించనున్న జాబ్ మేళాకు సంబంధించి పోస్టర్లను ఎంపీ శివనాథ్ మంగళవారం గురునానక్ నగర్‌లోని తన కార్యాలయంలో తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటలవరకు నిర్వహించనున్న జాబ్ మేళాకు హాజరయ్యే అభ్యర్థులు ముందుగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ లింక్ నైపుణ్యం ఏపీ.గవ్.ఇన్/యూజర్.రిజిస్ట్రేషన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. 50కి పైగా ప్రముఖ కంపెనీలు, మూడువేల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పాల్గొంటున్నాయని తెలిపారు. గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ, ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లమా, ఏదైనా డిగ్రీ, బీటెక్, పీజీ పూర్తి చేసి అర్హత ఉన్నవారికి వివిధ కంపెనీలు ఉద్యోగావకాశాలు ఇస్తాయన్నారు. కార్యక్రమంలో గొట్టుముక్కల రఘురామరాజు, షేక్ నాగూర్, పి.చరణ్ సాయి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు వీవోఏల సస్పెన్షన్

» పంట నష్టపరిహారంలో అక్రమాలపై చర్యలు

మైలవరంరూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ఉన్నతాధికారుల ఆదేశాలను మండలస్థాయి అధికారులు బేఖాతరు చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇద్దరు అధికారులను సస్పెండ్ చేయాలని చెప్పినా పట్టించుకోకపోవడంపై వ్యవసాయ శాఖలో కలకలం రేగింది. మండలంలోని పుల్లూరులో వైసీపీ ప్రభుత్వ హయాంలో చోటుచేసుకున్న పంట నష్టపరిహారంలో అక్రమాలకు బాధ్యులైన ఇద్దరు గ్రామ వ్యవసాయ సహయకులను మరోసారి ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. 2021వ సంవత్సరంలో అక్రమాలు వెలుగులోకి రాగా అప్పట్లో విధులు నిర్వహిస్తున్న ఏవో సంజీవ్‌కుమార్, సహాయకులు జమలయ్య, చందులతో పాటు గ్రామ వీఆర్వో శ్రీనివాసరెడ్డిలను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. అక్రమంగా నిధుల మళ్లింపు వ్యవహారం అప్పట్లో జిల్లాలో సంచలనం సృష్టించింది. అక్రమాల వ్యవహారం విచారణలో ఉండగానే సస్పెండ్ అయిన అధికారులకు తిరిగి పోస్టింగులు ఇచ్చారు. దాదాపు రూ.1కోటి వరకు అక్రమంగా రైతుల ఖాతాల్లోకి నిధులు వెళ్లాయని, అందుకు ఈ క్రాప్ నమోదులో అవతవకాలే కారణమని అధికారులు నిర్ధారించారు. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మరోసారి ఇద్దరు సహాయకులను సస్పెండ్ చేయాలంటూ 4నెలల కిందట వ్యవసాయ శాఖ కమిషనర్ నుంచి అధికారులకు ఆదేశాలు అందాయి. దీంతో ఈనెల 4న ఇరువురిని సస్పెండ్ చేస్తూ ఏడీఏ శ్రీనివాస్ ఉన్నతాధికారుల ఆదేశాలను అందజేశారు. నాలుగు నెలల తరువాత సస్పెండ్ చేయడంపై వ్యవసాయ శాఖలో కలకలంగా మారింది. ఇద్దరి అధికారులకు నాలుగు నెలలపాటు జీతాలు ఇవ్వడంపై శాఖలో తీవ్ర చర్చ జరుగుతున్నట్లు సమాచారం.

కేఎల్ రావు అడుగుజాడల్లో..

» నదుల అనుసంధానం అమలు ఘనత సీఎం చంద్రబాబుదే

» 124వ జయంతి సభలో మంత్రి నిమ్మల రామానాయుడు



కేఎల్ రావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

కలెక్టరేట్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : నదుల అనుసంధానం ద్వారానే దేశ అభివృద్ధి సాధ్యమని 50 ఏళ్ల క్రితమే చెప్పిన గొప్ప దార్శనికుడు, ప్రఖ్యాత ఇంజినీర్ కేఎల్ రావు అని జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కొనియాడారు. విజయవాడలో మంగళవారం జరిగిన డాక్టర్ కేఎల్ రావు 124వ జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. మోడల్ గెస్ట్ హౌస్ వద్ద కేఎల్ రావు విగ్రహానికి మంత్రి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఇరిగేషన్ రంగానికి కేఎల్ రావు చేసిన సేవలు అమూల్యం, అజరామరం అని ప్రశంసించారు. శ్రీశైలం, నాగార్జునసాగర్, హిరాకుడ్ వంటి అనేక బహుళార్థసాధక ప్రాజెక్టుల రూపకల్పనలో కేఎల్ రావు పాత్ర ప్రధానమైనది, ప్రముఖమైనదని నిమ్మల గుర్తు చేశారు. నీరు ఉంటేనే పంటలు పండి సిరిసంపదలు సిద్ధిస్తాయని నమ్మిన గొప్ప దేశభక్తుడు డాక్టర్ కేఎల్ రావు అని మంత్రి పేర్కొన్నారు. ఆనకట్టలు అంటే ఆధునిక దేవాలయాలని, ఆర్థిక అభివృద్ధికి సాధనాలనే నానుడి ఆయన కాలంలోనే వచ్చిందన్నారు. ఆయన ముందుచూపు, స్ఫూర్తినే ముఖ్యమంత్రి చంద్రబాబు అందిపుచ్చుకున్నారన్నారు.

పోలవరం ప్రాజెక్టు 2027 డిసెంబరు నాటికి పూర్తిచేసి అటు ఉత్తరాంధ్రకు ఇటు రాయలసీమకు నీరందించాలనే కృత నిశ్చయంతో కూటమి ప్రభుత్వం కృషి చేస్తున్నదని చెప్పారు. 2014-19 టీడీపీ హయాంలో పోలవరం ప్రాజెక్టు 72 శాతం పూర్తిచేస్తే 2019లో వచ్చిన వైసీపీ ప్రభుత్వం రెండుశాతం పనులు కూడా చేయకుండా గాలికి వదిలేసిందని నిమ్మల విమర్శించారు. అలాగే ఆనాటి తెలుగుదేశం ప్రభుత్వం నదుల అనుసంధానంలో భాగంగా పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా రూ.1300 కోట్లు వెచ్చించి గోదారమ్మను కృష్ణమ్మతో కలిపిన ఘనత చంద్రబాబుదేనన్నారు. నదుల అనుసంధాన ప్రక్రియకు బీజం వేసింది నాడు కేఎల్ రావు అయితే దానిని ఆచరించి అమలు చేసి చూపిన ఘనత చంద్రబాబుదే అనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. రూ.1300 కోట్ల ఖర్చుతో 50 వేల కోట్ల సంపదను టీడీపీ ప్రభుత్వం అందించిందని నిమ్మల స్పష్టం చేశారు. అలాగే గోదావరి ద్వారా ఏటా సముద్రంలో పోతున్న 3 వేల టీఎంసీల నీటిని ఒడిసి పట్టి అందులో 200 టీఎంసీల నీటిని రాయలసీమకు పంపడం ద్వారా రాయలసీమ కూడా సస్యశ్యామలం అవుతుందని, రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు నీటిని ఇవ్వగలుగుతాయని రామానాయుడు స్పష్టం చేశారు. అలాగే ఇరిగేషన్ రంగం అంటే అన్నదాతలకు సేవ చేసే రంగమని, అలాంటి రంగంలో మనమందరం పనిచేయడం ఎంతో గర్వకారణమని మంత్రి చెప్పారు. రాయలసీమ, కోస్తా ఆంధ్ర, ఉత్తరాంధ్ర ప్రాంతాల్లో నీటి వనరులకు, ప్రాజెక్టులకు, ఎత్తిపోతల పథకాలకు నాటి తెలుగుదేశం ప్రభుత్వం ఏమేం చేసింది, ఎంతెంత వ్యయం చేసింది, వాటి వల్ల ఒనగూరిన ప్రయోజనం ఏమిటి తదితర అంశాలను మంత్రి గణాంకాలతో సహా వివరించారు. అలాగే 2019-24 మధ్య కాలంలో విధ్వంసకర జగన్ ప్రభుత్వం ఏ విధంగా నాశనం చేసింది, ప్రజలు ఎంత నష్టపోయారనే అంశాలను కూడా మంత్రి వివరించారు. కృష్ణా, గోదావరి అనుసంధానం ద్వారా 13 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరించవచ్చని చెప్పారు. పులిచింతలలోని నీటి నిల్వలు గురించి కూటమి ప్రభుత్వం వచ్చాక ఏం చర్యలు తీసున్నది, ఈ రోజుకి కూడా 20 టీఎంసీల నీటిని నిల్వ వుంచేటట్టు, సమర్థ నీటి నిర్వహణ అంటే ఎలా వుంటుందో నిమ్మల వివరించారు. సమర్థ నాయకుడు చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో ప్రధాని మోదీ ఆశీస్సులతో నీటిపారుదల ప్రాజెక్టులను అనతికాలంలోనే పూర్తి చేసుకోగలుగుతామని నిమ్మల చెప్పారు. ఇలాంటి తరుణంలో ఇరిగేషన్ శాఖ అధికారులు, ఇంజనీర్లు చిత్తశుద్ధితో శక్తివంచ న లేకుండా కృషిచేసిననాడు ప్రభుత్వ ఆశయం నెరవేరుతుందన్నారు. తద్వారా దివంగత దార్శనికుడు కేఎల్ రావుకు మనం సమర్పించే నిజమైన నివాళి అవుతుంది అని రామానాయుడు పేర్కొన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మంత్రి పలువురు సీనియర్ ఇంజినీర్లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల వెంటక గోపాలకృష్ణారావు, కృష్ణా తూర్పు డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ దేవబోయిన వెంకటేశ్వరరావు, ఇఎన్‌సీ అడ్మిన్ శ్యాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సమస్య రానీయొద్దు

(3వ పేజీ తరువాయి)

గుర్తించాలన్నారు. తాను కూడా త్వరలో పంట కాలువల వెంబడి పర్యటిస్తానని తెలిపారు. నీటిపారుదలశాఖ అధికారులు జిల్లాలోని ప్రధాన కాలువలకు సాగునీటిని విడుదల చేస్తున్న విధానాన్ని కలెక్టర్‌కు వివరించారు. రైవస్ కాలువకు 5,200 క్యూసెక్కులు, బందరు కాలువకు 3,000 క్యూసెక్కులు, ఏలూరు కాలువకు 1,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్టు చెప్పారు. నీటిపారుదలశాఖ ఎస్ఈ ఆర్.మోహనరావు, ఈఈలు రావెళ్ల రవికిరణ్, అంజనేయప్రసాద్ పాల్గొన్నారు.

పంట బీమా సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోండి

జిల్లాలోని రైతులంతా ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన ద్వారా పంట బీమా ప్రీమియం సకాలంలో చెల్లించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బాలాజీ ఆదేశించారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన అమలుపై జిల్లాస్థాయి పర్యవేక్షణ కమిటీ సమావేశం కలెక్టర్ చాంబరులో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అనుకోని పరిస్థితుల్లో ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే రైతులు పంటలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఇలాంటి సమయంలో పంటల బీమా ద్వారా రైతులను ఆదుకోవాల్సి ఉందన్నారు. గతేడాది బుడమేరు, కృష్ణానది వరదల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని గుర్తు చేశారు. వరికి పంట బీమా ప్రీమియం ఆగస్టు 15లోగా, పసుపు పంటకు జూలై నెలాఖరులోగా చెల్లించాల్సి ఉందన్నారు. అనంతరం ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనపై వ్యవసాయశాఖ, టాటా ఏజీజీ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ సంయుక్తంగా ముద్రించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ ఏడీ మణిధర్, లీడ్ బ్యాంక్ మేనేజర్ ఎం.రవీంద్రారెడ్డి, ఉద్యానశాఖ జేడీ జే.జ్యోతి, నీటిపారుదలశాఖ ఎస్ఈ మోహనరావు, గణాంకశాఖ అధికారి పద్మజ, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త మంజువాణి, టాటా ఏఐజీ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ మేనేజర్ సతీష్, అభ్యుదయ రైతు అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కుల కుట్రల రాజకీయం!

(3వ పేజీ తరువాయి)

ప్రీ ప్లాన్‌గా ఉన్నట్లుగా కనిపిస్తోంది. కొడాలి నాని నివాసానికి వెళ్లి ఆయనను హత్తుకుని మరీ మద్దతు పలికారు. ఆ తర్వాత ఇద్దరూ చర్చించుకున్నారు. కుల సంఘాల నేతలతోనూ సమావేశం అయ్యారు. కొడాలి నాని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సంతకం చేయాల్సి ఉండటంతో ఇద్దరూ కలిసి ఒకే కారులో పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. అక్కడ కొడాలి నాని సంతకం చేసిన తర్వాత ఇద్దరూ బయటకు వచ్చారు. ఆ తర్వాత కఠారి ఈశ్వర్ కుమార్ ప్రెస్‌మీట్ పెట్టారు. ప్రెస్‌మీట్‌లో కఠారి ఈశ్వర్‌కుమార్ చాలా పరుషంగా మాట్లాడారు. చంద్రబాబు సతీమణికే ఆత్మాభిమానం ఉంటుందా ? బీసీ మహిళలకు ఉండదా అని ప్రశ్నించారు. చంద్రబాబు సతీమణిని కొడాలి నాని విమర్శించినట్టు ఎక్కడా ఒక్క ఆధారం కూడా చూపించలేకపోయారని వ్యాఖ్యానించారు. బీసీ ప్రజాప్రతినిధిపై గుడివాడలో టీడీపీ గూండాలు అవమానకరంగా మాట్లాడారని వ్యాఖ్యానించారు. బీసీ జాతి అంతా హారికను సోదరిగా భావిస్తోందని, మీడియా ముందు మాట్లాడలేనంతగా ఆమెను దూషించారని ఆరోపించారు. వైసీపీ బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనారిటీ వర్గాలపై దాడులు జరిగితే సహించేది లేదని హెచ్చరించారు. బాధితులకు తాను అండగా ఉంటానని చెబుతూనే హారికకు యాదవ సంఘం మద్దతుగా నిలుస్తోందని ప్రకటించారు. ఇక్కడే అసలు విషయం దాగుంది. కఠారి ఈశ్వర్ కుమార్ యాదవ సామాజిక వర్గానికి చెందిన వారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు మర్రి చెన్నారెడ్డి కేబినెట్‌లో విద్యాశాఖ మంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత వైసీపీలో, టీడీపీలో కొనసాగిన ఆయన కొంత కాలంగా తటస్థంగా ఉంటున్నారు. ఇప్పుడు సడెన్‌గా గుడివాడకు ఈశ్వర్‌కుమార్ ఎంట్రీ ఇచ్చారు. కొడాలి నానికి కఠారి ఈశ్వర్‌కుమార్ మద్దతు తెలపటం వెనుక లోపాయకారి ఒప్పందం ఉందని తెలుస్తోంది.

బీసీ వర్గాలను తన వైపు తిప్పుకునేందుకే..

గుడివాడ నియోజకవర్గంలో దారుణ ఓటమిని చవిచూసిన కొడాలి నాని తాజాగా హారిక ఉదంతాన్ని అడ్డం పెట్టుకుని ఆయా వర్గాలను తన వైపు తిప్పుకునేందుకే కఠారిఈశ్వర్ కుమార్‌ను రంగంలోకి దించినట్టు తెలుస్తోంది. గుడివాడ నియోజకవర్గంలో కుల రాజకీయాలకు పరోక్షంగా నానీలు ఆజ్యం పోస్తున్నారు. గుడివాడ నియోజకవర్గంలో అత్యధికంగా బీసీలకు 70 వేల ఓట్లు ఉన్నాయి. ఆ తర్వాత కాపు 28 వేల ఓట్లు, కమ్మ 12 వేల ఓట్లు ఉన్నాయి. అగ్రస్థానంలో ఉన్న బీసీ కులాలలో అత్యధికంగా ఇంచుమించు కాపులతో సమానంగా 25 వేల యాదవుల ఓట్లు ఉన్నాయి. ఆ తర్వాత గౌడ సామాజిక వర్గానికి సంబంధించి 17 వేల ఓట్లు ఉన్నాయి. కొప్పువెలమ ఏడు వేలు, కాళింగ నాలుగు వేలు, రజక నాలుగు వేలు చొప్పున, మిగిలిన ఇతర బీసీ కులాలకు కూడా చెప్పుకోదగిన ఓటు బ్యాంకు ఉంది. హారిక ఉదంతాన్ని అడ్డం పెట్టుకుని గౌడ సామాజిక వర్గాన్ని, కఠారి ఈశ్వర్ కుమార్‌ను అడ్డం పెట్టుకుని యాదవుల ఓట్లను తమ వైపునకు తిప్పుకునేందుకు నాని సాగించిన ఎత్తుగడగా అర్థమవుతోంది. బీసీ మహిళ హారికపై దాడి జరిగిందంటూ బీసీల్లో టీడీపీపై వ్యతిరేకత తీసుకువచ్చే ప్రయత్నాలను ముమ్మరం చేశారు.

బీసీ మహిళా ప్రజాప్రతినిధులకు ఆత్మాభిమానం ఉండదా : కఠారి



గుడివాడ : ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి భువనేశ్వరికి ఆత్మాభిమానం ఉంటే, బీసీ మహిళా ప్రజాప్రతినిధులకు ఆత్మాభిమానం ఉండదా.. అని మాజీ మంత్రి కఠారి ఈశ్వరకుమార్ ప్రశ్నించారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. జెడ్పీ ఛైర్‌పర్సన్ ఉప్పాల హారికపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. చంద్రబాబు సతీమణి భువనేశ్వరిని మాజీమంత్రి కొడాలి నాని విమర్శించినట్టు ఒక్కఆధారం కూడా చూపించలేకపోయారని విమర్శించారు. చంద్రబాబు సతీమణి తనకు సోదరి సమానురాలన్నారు. బీసీలకు వ్యక్తిత్వం ఉండదన్నట్టు టీడీపీ నాయకులు వ్యవహరిస్తున్నారన్నారు. గుడివాడ యాదవ సంఘం అంతా హారికకు మద్దతుగా నిలస్తుందన్నారు.

విద్యా అవస్థ!

(3వ పేజీ తరువాయి)

నుంచి ఐదు తరగతుల వరకు, తరగతికి ఒక టీచర్ ఉండేలా ఐదుగురు టీచర్‌లను విద్యాశాఖ అధికారులు ఇటీవల జరిగిన బదిలీల్లో అక్కడకు పంపారు. కానీ బడిఈడు పిల్లలందరూ మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో చేరలేదు. దీంతో ఈ తరహాలోని కొన్ని పాఠశాలల్లో 30 మందిలోపే ఉన్నారు.

తరగతికి ఒక టీచర్ ఉన్నారు కాబట్టి, 60 మంది పిల్లలు ఈ మోడల్ పాఠశాలల్లో ఉండేలా చూడాలనే నిబంధన పెట్టారు. మోడల్ స్కూల్‌కు సమీపంలో ఉన్న గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులను మోడల్ పాఠశాలల్లోకి తీసుకురావాలని ఎంఈవోలు, క్లస్టర్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు టీచర్‌లపై ఒత్తిడి తెస్తున్నారు. ఈ ఏడాది మోడల్ పాఠశాలల్లో 60 మంది విద్యార్థుల సంఖ్యను చూపకుంటే, వచ్చే ఏడాది ఉపాధ్యాయులు, విద్యార్థుల నిష్పత్తిని పరిగణనలోకి తీసుకుని మిగులుబాటుగా ఉన్న టీచర్‌లను దూర ప్రాంతాల్లో ఉన్న పాఠశాలలకు బదిలీ చేయడం ఖాయమని విద్యాశాఖ అధికారులు చెప్పకనే చెబుతున్నారు. టీచర్‌లు మోడల్ ప్రాథమిక పాఠశాలకు సమీపంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి అక్కడ ఉన్న పిల్లలను తమ పాఠశాలకు పంపాలను అడుగుతున్నారు. ఒకటి నుంచి 5వ తరగతి చదివే విద్యార్థుల తల్లిదండ్రులు మాత్రం తమ పిల్లలు ప్రస్తుతం చదువుతున్న పాఠశాలలోనే ఉంటారని, దూరప్రాంతంలోని పాఠశాలల్లో చేర్పబోమని తెగేసి చెబుతున్నారు. దీంతో మోడల్ పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్‌ల పరిస్థితి 'ముందు నుయ్యి, వెనుక గొయ్యి' అన్న చందంగా మారింది. మరోవైపు స్థానికంగా ఉన్న సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు ప్రస్తుతం విద్యార్థులు చదువుతున్న పాఠశాలల్లోనే ఉంటారని, ఇక్కడి వారిని వేరే పాఠశాలకు పంపితే, వచ్చే ఏడాది తమ గ్రామంలోని పాఠశాలను వేర్వేరు కారణాలు చూపి రద్దు చేస్తారని, ఈ తలనొప్పులు మాకెందుకని ఖరాఖండిగా చెబుతున్నారు. ఆర్థికంగా వెనుకబడి, ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులు కట్టలేనిస్థితిలో ఉన్న వారిని గుర్తించి, వారి గృహాలకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో మీ పిల్లలను చేర్పించాలని టీచర్లు కోరుతుంటే.. ఇప్పుడా అడిగేది, ఈ సంవత్సరానికి వదిలేయండి, వచ్చే సంవత్సరం చూద్దామని తల్లిదండ్రులు చెబుతున్నారు.

పాఠాలు చెప్పిందేలేదు!

వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభమై నెలరోజులపైనే అయ్యింది. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్‌లకు శిక్షణ కార్యక్రమాల పేరుతో ప్రత్యేక షెడ్యూల్‌ను ప్రకటించింది. ఈ నెల 14వ తేదీ నుంచి 18వ తేదీ వరకు తొలి విడతగా, ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు రెండో విడతగా ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్‌లకు సమగ్రశిక్ష ద్వారా స్కూల్ లీడర్ షిప్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ 2025-26 కార్యక్రమంలో భాగంగా శిక్షణ ఇస్తున్నారు.

ఈ కార్యక్రమంలో టీచర్‌లకు పాఠ్యాంశాల బోధనలో మెళకువలను నేర్పిస్తున్నారు. మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం పిల్లలను బడిలో చేర్పించే పనితో పాటు, శిక్షణ కార్యకమాలకు హాజరవుతుండటం, ఎంఈవోలు, క్లస్టర్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నిర్వహించే సమావేశాలకు వెళ్లడంతో ఇంతవరకు పాఠశాలల్లో పాఠ్యాంశాల బోధన ఇంకా పూర్తిస్థాయిలో ప్రారంభమే కాలేదని ఉపాధ్యాయులు అంటున్నారు. టీచర్లపై ఒత్తిడి తగ్గించి వచ్చే ఏడాది నాటికి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ముందస్తుగానే ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రవీంద్ర

పేర్ని నానీ.. నోరు అదుపులో పెట్టుకో!

» తాతల కాలం నుంచే వ్యాపారం రంగంలో ఉన్నాం

» కొడాలి నానితో కలిసి కోట్ల కమీషన్లు కొట్టేయలేదా

» పేదల బియ్యాన్ని పందికొక్కుల్లా మింగేయలేదా

» కుటుంబ వ్యవహారంలో తలదూర్చితే కోర్టుకెళతాం

» మంత్రి కొల్లు రవీంద్ర ధ్వజం

మచిలీపట్నం టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : పేర్ని నానీ.. నోరు అదుపులో పెట్టుకో.. లేకపోతే ప్రజలే నీకు బుద్ధి చెబుతారు. ఇష్టారాజ్యంగా మాట్లాడితే కోర్టుకు వెళ్లాల్సి వస్తుంది.. అని ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. మంగళవారం టీడీపీ అసెంబ్లీ నియోజకవర్గ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. జగన్ రెడ్డి ఆదేశాలతో పేర్ని నాని అంబోతులా మాట్లాడుతున్నాడని, కుల మతాల మధ్య విభేదాలు సృష్టిస్తున్నారని, పామర్రు, పెడన సభల్లో పేర్ని నాని ఇష్టారీతిన తనపైనా, సీఎం చంద్రబాబుపైనా విమర్శలు చేయడం అర్థరహితమన్నారు. ఐదేళ్ల అరాచకాలకు పాల్పడి పేదల బియ్యం పందికొక్కుల్లా మింగేసారని ఆరోపించారు. గుడివాడ సమావేశానికి వెళితే ప్రజలు తంతారనే భయంతోనే ఇంట్లో దాక్కున్నారన్నారు. ఇలాగే విమర్శిస్తే ప్రజలు రానున్న రోజుల్లో జీరో చేస్తారన్నారు. ఆడబిడ్డల గురించి అడ్డగోలుగా మాట్లాడితే ప్రజలు తోలు తీస్తారన్నారు. గత ఐదేళ్ల రాష్ట్రాన్ని దోచుకుని సంపాదించిన ఆస్తుల వివరాలను బయటపెడతామన్నారు. మాట్లాడిన ప్రతి మాటకు ప్రతి చర్య ఉంటుందన్నారు. మహిళ అయిన పేర్ని నాని భార్యను జైలు లో పెట్టడం మంచిది కాదని భావించామన్నారు. తానే బియ్యం దొంగగా ఒప్పుకుని పేర్ని నాని రూ. కోటి 20 లక్షలు ప్రభుత్వానికి చెల్లించారన్నారు. పోతేపల్లిలో గౌడ సోదరులను కొట్టినప్పుడు బీసీ కార్డు ఏమైందన్నారు. సుల్తానగరంలో బీసీలపైనే అక్రమ కేసులు పెట్టించలేదా అని ప్రశ్నించారు. రాత్రి చంపేసి తెల్లారి పరామర్శించాలన్న పేర్నినానిని సైకో అంటే తప్పేమిటన్నారు. అరాచకశక్తులను రాష్ట్రం నుంచి తరిమి కొట్టాలన్నారు. ఇసుక దోపిడీ చేశానని చెపుతున్న పేర్నినాని రామాలయంలో ప్రమాణం చేయడానికి సిద్ధమా అని ప్రశ్నించారు. తన తండ్రి రాసిన వీలునామా ప్రకారం ఆస్తులు పంచుకున్నామని, దానిని కూడా రాద్ధాంతం సృష్టించి కుటుంబం మధ్య గొడవలు సృష్టించేందుకు ప్రయత్నం చేయడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో సీనియర్ నాయకులు గొర్రెపాటి గోపీచంద్, మార్కెట్‌యార్డు ఛైర్మన్ కుంచేనాని తదితరులు పాల్గొన్నారు.



ఆరోగ్యశ్రీ సీఈవోకు వినతి పత్రం ఇస్తున్న బొప్పరాజు

ఆర్టీసీ ఉద్యోగులకు ఈహెచ్‌ఎస్ వర్తింపునకు చర్యలు

బస్‌స్టేషన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : పదవీవిరమణ చేసిన ఆర్టీసీ ఉద్యోగులకు ఎంప్లాయీస్ హెల్త్ స్కీం (ఈహెచ్‌ఎస్)ను వర్తింపచేసేందుకు చర్యలు తీసుకోనున్నట్టు ఆరోగ్యశ్రీ సీఈవో తెలిపారని ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు, ప్రధాన కార్యదర్శి జీవీ నర్సయ్యలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ కార్యాలయంలో ఆరోగ్యశ్రీ సీఈవో ఆధ్వర్యంలో మంగళవారం ఈహెచ్‌ఎస్ మేనేజింగ్ కమిటీ సమావేశం జరిగిందని, ఆర్టీసీలో పదవీ విరమణచేసిన ఉద్యోగులకు ఈహెచ్‌ఎస్ వర్తింపజేయాలని, మెడికల్ స్కీంకు విధి విధానాలు రూపొందించాలనదానిపై చర్చ జరిగిందని తెలిపారు. ఇదే సమయంలో 2020కు ముందు పదవీవిరమణ పొందిన ఆర్టీసీ ఉద్యోగులకు ఈహెచ్‌ఎస్ వర్తింపచేయాలంటూ యూనియన్ రాష్ట్ర కమిటీ జనవరిలో చేసిన విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం జీవో ఇచ్చిందన్నారు. అయితే వన్ టైం ప్రాతిపదికన ఆయా కేటగిరీల ఉద్యోగులు ఎంతెంత చెల్లించాలన్నదానిపై విధివిధానాలు రూపొందించేందుకు సమావేశంలో చర్చించామన్నారు. ఈ మేరకు ఏపీ అమరావతి జేఏసీ ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సీఈవోకు లేఖ ఇచ్చినట్టు తెలిపారు. దీనిపై సీఈవో స్పందిస్తూ త్వరలోనే ఉత్తర్వులు జారీ చేస్తామని, విధి విధానాలు రూపొందిస్తామని తెలిపారన్నారు.

కన్సల్టెన్సీల కహానీలు

(3వ పేజీ తరువాయి)

రంగంలో శిక్షణ పొంది ఉపాధిని చూసుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. ఆ అవసరాలను తామే తీర్చుతామంటూ కొందరు ప్రముఖులు ముందుకు వస్తున్నారు. జాబ్ కన్సల్టెన్సీల పేరుతో బోర్డులు ఏర్పాటు చేసుకుని కార్యకలాపాలు మొదలుపెడుతున్నారు. రకరకాల ఆఫర్లు ప్రకటించి అభ్యర్థులను ఆకర్షిస్తున్నారు. డబ్బులు ఖర్చయినా ఉపాధి లభిస్తుందన్న గంపెడంత ఆశలో అభ్యర్థులు ఉంటున్నారు. చివరికి అభ్యర్థుల ఆశలన్నీ అడియాశలు అవుతున్నాయి. అప్పులు చేసి కన్సల్టెన్సీలో చేరిన వారికి అప్పులకు మించి పెరుగుతున్న వడ్డీలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం విజయవాడలో కొన్ని కన్సల్టెన్సీల తీరు చర్చనీయాంశంగా మారుతోంది. శిక్షణ పూర్తయిన తర్వాత ఉపాధిని చూపించే విషయంలో ఉత్తరాది కన్సల్టెన్సీల పేరు చెప్పి రోజులు గడిపేస్తున్నారు.

ఫిర్యాదులతోనే సరి..

కన్సల్టెన్సీల నిర్వాహకులు ఒక్కో శిక్షణకు ఒక్కో విధంగా ప్యాకేజీని అమలు చేస్తున్నారు. కొన్ని రకాల శిక్షణలకు రూ.50 వేలు, మరికొన్ని రకాల శిక్షణలకు రూ.లక్ష, ఇంకొన్ని రకాల శిక్షణలకు రూ.1.50 లక్షల వరకు వసూలు చేస్తున్నారు. విద్యకు, ఉపాధికి విజయవాడ కేంద్రంగా ఉండడంతో వివిధ జిల్లాల నుంచి నిరుద్యోగులు ఇక్కడికి వచ్చి కన్సల్టెన్సీల్లో చేరుతున్నారు. కన్సల్టెన్సీల్లో చెల్లించడానికి డబ్బులు లేనివారు అప్పులు చేసి మరీ చేరుతున్నారు. శిక్షణ పూర్తయ్యే సరికి కన్సల్టెన్సీ బూటకమని తెలుసుకున్న అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. శిక్షణ పూర్తవ్వగానే ఇంటికి పంపేస్తున్నారు. ఉపాధి అవకాశాలు వచ్చిన వెంటనే సమాచారం ఇస్తామని చెబుతున్నారు. నెలలు గడుస్తున్నా ఉపాధి అవకాశాలు రాకపోయే సరికి శిక్షణ పొందిన వాళ్లంతా నిర్వాహకులను నిలదీస్తున్నారు. అప్పటికే మొత్తం డబ్బులు వసూలు చేసిన నిర్వాహకులు ఘరానాగా సమాధానం చెబుతున్నారు. చెల్లించిన డబ్బులు అడిగితే రేపు మాపు అంటూ కార్యాలయాల చుట్టూ తిప్పించుకుంటున్నారు. బాధితులు ఫోన్లు చేసినా ఆన్సర్ చేయడం లేదు. కార్యాలయంలో ఉన్న సిబ్బందిని అడిగితే తమకు ఏమీ తెలియదని సమాధానం ఇస్తున్నారు. దీంతో విసుగుపోయిన బాధితులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. ఈ కన్సల్టెన్సీల నిర్వాహకులకు వెనుక రాజకీయ, వివిధ రకాల బలాలు ఉండడంతో పోలీసులు ఫిర్యాదులు తీసుకున్నా కేసులు నమోదు చేయడం లేదు. కొన్ని స్టేషన్లలో కేసులు నమోదు చేసినా నిర్వాహకులను విచారణకు పిలవడం లేదు. దీంతో పోలీసు స్టేషన్లలో తమకు న్యాయం జరుగుతుందన్న అభిప్రాయాన్ని బాధితులు కోల్పోతున్నారు.

పెనమలూరు

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	99, 107, 118
చికెన్ విత్ స్కిన్	190
చికెన్ స్కిన్‌లెస్	200



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 515

ఓటర్లకు అందుబాటులో పోలింగ్ బూత్‌లు



గన్నవరం, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ఓటర్లకు అందుబాటులో పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేస్తున్నట్టు నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి టి.శివ రామ ప్రసాద్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. నాలుగు మండలాలకు సంబంధించి ఓటర్ల తాజా పరిస్థితి, పోలింగ్ బూత్‌ల వివరాలను తెలిపారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఆళ్ల గోపాలకృష్ణ, చిమటా రవివర్మ, తంగిరాల శ్రీనివాసరావు, చాగంటిపాటి వెంకటేశ్వరరావు, బోడపాటి రవికుమార్, తహశీల్దారు కె.వి.శివయ్య, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ కె.లక్ష్మీనాంచారమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే జైలు శిక్ష: ఈఈ



సర్వీసులపై విచారణ చేస్తున్న విజిలెన్స్ ఈఈ వాసు

హనుమాన్‌జంక్షన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరం.. నిందితులు ఏ స్థాయిలో ఉన్నా ఉపేక్షించమని జిల్లా విద్యుత్ విజిలెన్స్ విభాగం ఈఈ సీహెచ్.వాసు తెలిపారు. మంగళవారం హనుమాన్‌జంక్షన్ సబ్ డివిజన్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, విద్యుత్ చౌర్యం గతం కంటే చాలా తగ్గిందన్నారు. చట్టంమీద అవగాహన లోపంతో మధ్య తరగతి వినియోగదారులు విద్యుత్ చౌర్యానికి పాల్పడుతూ తనిఖీల్లో అధికారులకు చిక్కి భారీ మూల్యం చెల్లించుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జంక్షన్ సబ్ డివిజన్ డీఈఈ బి.శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

వణుకూరు మాజీ ఇన్‌చార్జి సర్పంచ్ రావి మృతి



పెనమలూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : వణుకూరు మాజీ ఇన్‌చార్జి సర్పంచ్ రావి నారాయణరావు(93) ఆదివారం ఉదయం ఆయన స్వగృహంలో మృతి చెందారు. వణుకూరు అభివృద్ధికి నారాయణరావు విశేషంగా కృషి చేశారు. తెలుగు దేశం పార్టీ స్థాపించిన నాటి నుంచి ఆయన పార్టీ అభివృద్ధికి తనదైన శైలీలో సేవలు అందించారు.

విద్యుత్ అదాలత్ అవగాహన సదస్సు 18న

గన్నవరం, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ అదాలత్ అవగాహన సదస్సును విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు నున్న ఏఈ శివారెడ్డి చెప్పారు. మండలంలోని ముస్తాబాద విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఆయన మాట్లాడుతూ, ఈ నెల 18న నున్న మెయిన్ రోడ్డులోని స్వప్న ఫంక్షన్ హాల్‌లో ఈ సదస్సును ఏర్పాటు చేశామన్నారు. ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ పి.హరిబాబు, జీఆర్ఎఫ్, ఏపీసీపీడీసీఎల్ ఛైర్మన్ పర్సన్ ఎస్.విక్టర్ ఇమ్మానుయేలు, ఎన్.శ్రీనివాసరావు, ఆర్‌సిహెచ్ శ్రీనివాసరావు, ఎ.సునీత తదితరులు పాల్గొని అవగాహన కల్పిస్తారని చెప్పారు.

షెడ్డు పైనుంచి పడి కార్మికుడు మృతి

గన్నవరం, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు షెడ్డు పైనుంచి జారి పడి కార్మికుడు మృతి చెందిన సంఘటన మండలంలోని వీరపనేనిగూడెంలోని పీఎస్ఆర్ కంపెనీలో జరిగింది. ఆత్కూరు ఎస్సై చావా సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గొల్లనపల్లి గ్రామానికి చెందిన కర్రే రామలక్ష్మణ్ (32) వీరపనేని గూడెంలోని పీఎస్ఆర్ కంపెనీలో సీలింగ్ రిపేర్ చేస్తూ రేకుల పైకిఎక్కి పని చేస్తుండగా పొరపాటున ఫైబర్ షీటుపై కాలు మోపటంతో 30 అడుగుల ఎత్తు నుంచి పడిపోయాడు. తోటి కార్మికులు, యాజమాన్యం చిన అవుటపల్లి పిన్నమనేని ఆస్పత్రికి తీసుకువెళ్లగా మృతి చెందినట్లు డాక్టర్‌లు నిర్ధారించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సొసైటీలను బలోపేతం చేస్తాం

ఎమ్మెల్యే బోడె ప్రసాద్



పెనమలూరు పీఏసీఎస్ కమిటీచే ప్రమాణం చేయిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వంలో కుంటుపడ్డ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (సొసైటీలు)ను బలోపేతం చేస్తామని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం పెనమలూరులో నూతనంగా ఎంపికయిన వ్యవసాయ పరపతి సంఘ త్రిసభ్య కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే ప్రమాణం చేయించి మాట్లాడారు. గ్రామ పంచాయతీ స్థాయిలో పనిచేసే పీఏసీఎస్‌ల ద్వారా రైతులకు రుణాలను అందించే కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించేట్లు ప్రభుత్వం చూస్తుందని హామీ ఇచ్చారు. పీఏసీఎస్ కమిటీ అధ్యక్షుడిగా కిలారు శ్రీనివాస్, సభ్యులుగా నెప్పల్లి హరీష్, ఉప్పులూరి కేశవరావులచే ఎమ్మెల్యే ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోయ ఆనంద్‌ప్రసాద్, మారుపూడి ధనకోటేశ్వరరావు, తలసిల కోటేశ్వరరావు, బోడె వెంకట్రాం, సంగెపు రంగారావు, లింగాల భాస్కరరావు, తోటకూర ఉదయ భాస్కర్, కలపాల శ్రీధర్, కొమ్మినేని శ్రీనివాసరావు, పాముల బలరాం పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : రైతులకు విశేష సేవలందిస్తూ, పీఏసీఎస్‌ల అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేద్దామని కలపాల నాగ వెంకటశివ ప్రసాద్ అన్నారు. వీరవల్లి పీఏసీఎస్ ఛైర్మన్‌గా మంగళవారం ఆయన డైరెక్టర్లతో కలిసి పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు బొడ్డుపాటి నాగరాజు, మరీదు చెన్నకేశవ పాల్గొన్నారు. మూల్పూరి సాయికళ్యాణి, గుండపనేని ఉమావరప్రసాద్, లంక సురేంద్ర మోహన బెనర్జీ, వేములపల్లి శ్రీనివాసరావు, తదితర ప్రముఖులు, ఎంపీటీసీ అమృతపల్లి సూర్యనారాయణ, ఉపసర్పంచ్ లంక అజయ్ కుమార్ ఛైర్మన్, డైరెక్టర్లను సత్కరించారు.

ఉంగుటూరు : రైతులకు మెరుగైన సేవలందించడంద్వారా సహకార సంఘాల బలోపేతానికి నూతన పాలకవర్గాలు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి వెంకటబాలవర్ధనరావు అన్నారు. ఆముదాలపల్లి పీఏసీఎస్ త్రిసభ్యకమిటీ ప్రమాణ స్వీకారోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. నూతన ఛైర్‌పర్సన్‌గా నియమితుడైన దాసరి నాగేంద్రబాబు, పర్సన్స్‌గా నియమితులైన జంగం జోజిబాబు, తేలు సత్యనారాయణలకు దాసరి చేతులమీదుగా నియామక పత్రాలు అందజేశారు. సొసైటీ మాజీ అధ్యక్షులు దాసరి జయప్రసాదరావు, వెంకటేశ్వరరావు, గుత్తా పూర్ణచంద్రరావు, పోతినేని వెంకటరమణారావు, నిమ్మగడ్డ రాజు, ఎంపీటీసీ దాసరి వెంకటబాపినీడు, సర్పంచ్ డొక్కు వెంకటరమణ, దాసరి శ్రీకృష్ణ, సీహెచ్ ప్రసాద్ పాల్గొన్నారు.



వీరవల్లి పీఏసీఎస్ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కలపాల ప్రసాద్‌ను సత్కరిస్తున్న టీడీపీ నాయకులు



ఆముదాలపల్లి సొసైటీ నూతన ఛైర్‌పర్సన్ నాగేంద్రబాబుకు నియామకపత్రం అందజేస్తున్న డాక్టర్ దాసరి బాలవర్ధనరావు



లంకపల్లిలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

స్వయం సహాయక సంఘాల

అభ్యున్నతికి ప్రాధాన్యం

సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే యార్లగడ్డ

ఉంగుటూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : స్వయం సహాయక సంఘాల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం తగిన ప్రాధాన్యత ఇస్తుందని, ఇందులో భాగంగా డ్వాక్రా మహిళలకు గతంలో వున్న 13శాతం వడ్డీని 11శాతానికి తగ్గించి రూ.28వేల కోట్ల లింకేజీ రుణాలు అందజేసిందని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. మండలంలోని లంకపల్లి, ఓంద్రంపాడు, ముక్కపాడు గ్రామాల్లో మంగళవారం సాయంత్రం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ముక్కపాడులో రూ.12లక్షల వ్యయంతో నిర్మించిన రెండు సీసీరోడ్లను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కొలుసు రవీంద్రబాబు, కుందేటి చంద్రశేఖర్, ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి, ఆరికట్ల రవికుమార్, కొండేటి వెంకటేశ్వరరావు, చల్లగుళ్ల షణ్ముఖ్, తుమ్మల జగదీష్, మల్లెల శివరంగారావు, జల్లెడ చిన్నపుల్లయ్య, మాయర రమేష్, జల్లెడ శ్రీమన్నారాయణ, రామిరెడ్డి బాలకృష్ణ, కర్రే ప్రేమ్‌కుమార్, కొండా రాంబాబు, నక్కా వీరవెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పెనమలూరు : టీడీపీ కూటమి ప్రభుత్వం గ్రామాలను బాగు చేస్తుందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. పెనమలూరు కొత్త హరిజనవాడలో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన స్థానికులకు ఏడాది పాలనలో జరిగిన అభివృద్ధిని వివరించే కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ కూటమి నాయకులతో పాటు తహశీల్దారు గోపాలకృష్ణ, ఎంపీడీఓ బండి ప్రణవి, పీఆర్ డీఈ, పీఎస్ తదితరులు పాల్గొన్నారు.

● యనమలకుదురు 19వ డివిజన్‌లో జరిగిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు శొంఠి శివరాంప్రసాద్, మొక్కపాటి శ్రీనివాస్‌లు ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. ఏడాది పాలనలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరించే కరపత్రాలను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో బూత్ కన్వీనర్లు తాడిశెట్టి వీరాస్వామి, బుక్కా రాజా, చిర్రావూరి శేషు, నాగరాజు, తిరుమలశెట్టి స్వామి, తాడిశెట్టి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ● మునిసిపాలిటీ 35వ డివిజన్‌లో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి యార్లగడ్డ సుచిత్ర నేతృత్వంలో టీడీపీ నాయకులు ప్రజలకు అభివృద్ధిని వివరించే కరపత్రాలను పంపిణీ చేశారు. పట్నాల అరుణ, సత్యనారాయణ పాల్గొన్నారు.



సనత్‌నగర్‌లో కరపత్రాలు పంపిణీ చేస్తున్న వెలగపూడి శంకరబాబు

కానూరు : కానూరులోని మదీన మసీద్, సనత్ నగర్, రేకుల మసీదు పరిసర ప్రాంతాల్లో మంగళవారం జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు ఆధ్వర్యంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శంకరబాబు పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ, ఏడాది కూటమి పాలన లో రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందిందని చెప్పారు.

గన్నవరం : ప్రజలకు సుపరిపాలన కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని టీడీపీ టౌన్ అధ్యక్షులు జాస్తి శ్రీధర్ అన్నారు. స్థానిక ఎస్సీ కాలనీలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మంగళ వారం ఏడాది కాలంలో ప్రభుత్వం, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు చేసిన పనులను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ లీగల్ సెల్ నాయకుడు జాస్తి తాతారావు, పటాన్ ఆసిఫ్‌ఖాన్, బల్లారి గోపిరాజు, కంపా దుర్గా, జాస్తి మురళీ పాల్గొన్నారు.

చిన ఓగిరాలలో భూమి రీసర్వే పూర్తి

ఉయ్యూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : చినఓగిరాలలో క్షేత్ర స్థాయి భూమి రీ సర్వే పూర్తయినట్లు తహసీల్దార్ ఎం. సురేశ్‌కుమార్ తెలిపారు. రీసర్వే పూర్తయిన సందర్భంగా రైతులకు నోటీసులు జారీ చేసి గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో సోమవారం సమావేశం ఏర్పాటు చేసి భూమి పూర్వపు రికార్డులలో ఎంత ఉంది, ప్రస్తుత రెవెన్యూ రికార్డుల్లో ఎంత ఉన్నది తెలియజేసి వారి భూమికి సంబంధించిన చిత్రపటం ద్వారా వివరించి కొలతల్లో హెచ్చు తగ్గులకు కారణాలు విశదీకరించినట్లు తెలిపారు. మండల సర్వేయర్ సురేశ్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

సబ్ స్టేషన్ నిర్మాణం చేపట్టాలి

ఉయ్యూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరులో 133/33 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణం చేయాలని యూఎఫ్ఆర్టీఐ రాష్ట్ర కో-కన్వీనర్ జంపాన శ్రీనివాస గౌడ్ కోరారు. విజయవాడ- మచిలీపట్నం మధ్యలో విద్య, వైద్యం, పారిశ్రామికంగా వేగంగా విస్తరిస్తూ చుట్టుపక్కల 50 గ్రామాలకుపైగా కేంద్రంగా ఉన్న ఉయ్యూరు పట్టణంలో విద్యుత్ వినియోగం రోజు రోజుకు అధికమవుతున్న పరిస్థితుల్లో 133/33 కేవీ సబ్‌స్టేషన్ లేకపోవడంతో తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడి ప్రజలకు అసౌకర్యం కలుగుతుందని, పామర్రు, గంగూరు సబ్‌స్టేషన్ల నుంచి విద్యుత్ సరఫరా చేస్తుండగా తరచూ సాంకేతిక లోపాలతో అంతరాయం ఏర్పడి నాణ్యమైన విద్యుత్ సరఫరా కాక ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతుందని తెలుపుతూ యుఎఫ్ఆర్టీఐ ప్రతినిధుల బృందం జిల్లా కలెక్టర్‌ను కలసి వినతిపత్రం అందజేసినట్టు తెలిపారు.

పేదరిక నిర్మూలనలో భాగస్వాములవ్వాలి

గన్నవరం, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : పేదరిక నిర్మూలన కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న బంగారు కుటుంబాల దత్తత కార్యక్రమంలో అర్హులైన ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని నియోజకవర్గ ప్రత్యేక అధికారి షాహిద్‌బాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశం మందిరంలో గన్నవరం, బాపులపాడు, ఉంగు టూరు మండలాల్లోని ప్రయివేటు పాఠశాలల కరస్పాండెంట్లు, వృద్ధాశ్రమ, ఛైల్డ్ కేర్, అనాథాశ్రమాల యజమానులతో సమావేశం మంగళవారం నిర్వహించారు. తహసీల్దార్ కేవీ శివయ్య, ఎంపీడీవో టి.స్వర్ణలత, గుడివాడ డీఎల్‌డీవో కొండా రవికుమార్ పాల్గొన్నారు.

రైతులు పంట బీమా చేయించుకోవాలి

ఉంగుటూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రతి రైతు పంటల బీమా చేయించుకుని ప్రకృతి విపత్తుల వల్ల సంభవించే ఆర్థిక నష్టాల నుంచి తమను తాము రక్షించుకోవాలని ఏవో గద్దె రమేష్ అన్నారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని పెదఅవుటపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఖరీఫ్ (సార్వా) వరి నాట్లు వేస్తున్న వ్యవసాయ క్షేత్రాలను ఏఈఓ బి.దుర్గానాగేశ్వరరావుతో కలిసి సందర్శించారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు రఘు, మీనా, రసూల్, పలువురు రైతులు పాల్గొన్నారు.

నీటి వినియోగంపై అవగాహన పెరగాలి

కానూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు నీటి వినియోగంపై అవ గాహన పెరగాల్సిన అవసరం ఎంతైనా ఉందని విజయవాడ సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ వాటర్ రిసోర్సెస్ విభాగం సూపరింటెండెంట్ ఇంజనీర్ జీఎస్ శివకుమార్‌రెడ్డి అన్నారు. కానూరులోని సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీలో డిపార్టుమెంట్ ఆఫ్ సివిల్ ఇంజనీరింగ్, ఏఎస్‌సీఈ స్టూడెంట్స్ చాప్టర్ ఆధ్వర్యంలో డాక్టర్ కేఎల్ రావు 124వ జయంతి సందర్భంగా మంగళవారం వాటర్ రిసోర్సెస్ రంగంలో రీసెంట్ టెరెండ్స్‌పై వర్క్‌షాప్ జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జీఎస్ శివకుమార్‌రెడ్డి ప్రసంగిస్తూ విద్యార్థులకు నీటి వినియోగంపై ఆధునిక సాంకేతికతలు, ప్రాజెక్టుల రూపకల్పనపై నైపుణ్యం ఉండాలని సూచించారు. కార్యక్ర మంలో ఏఎస్‌సీఈ ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్ హరూర్ అలీ ఖాన్, సివిల్ ఇంజనీరింగ్ విభాగం హెడ్ డాక్టర్ వి. మల్లికార్జునలు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి

కానూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు వినయం, ఆత్మవిశ్వాసం, పట్టుదల, సాధించాలనే తపన, ఆతృత ఉంటే జీవితంలో ఉన్నత వ్యక్తులుగా ఎదుగు తారని మానవ వనరుల అభివృద్ధి శిక్షకులు డాక్టర్ ఎంసీ దాసు అన్నారు. కానూరులోని కేసీపీ సిద్ధార్థ ఆదర్శ్ రెసిడెన్సియల్ పబ్లిక్ స్కూల్‌లో మంగళవారం విద్యార్థుల క్యాబినెట్ ప్రమాణ స్వీకారోత్సవం, పాఠశాల సంస్థాపన దినోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంసీ దాసు మాట్లాడుతూ, తల్లిదండ్రులు, గురువులను గౌరవించాలన్నారు. ప్రిన్సిపాల్ వి. సాయికృష్ణ క్యాబినెట్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో పాఠశాల కన్వీనర్ వీరపనేని శశికళతోపాటు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన

ఉంగుటూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : గుడ్‌టచ్(మంచి స్పర్శ), బ్యాడ్ టచ్(చెడు స్పర్శ)ల మధ్య వ్యత్యాసాన్ని పిల్లలకు వివరించడం వారి భద్రత, శ్రేయస్సుకు చాలా అవసరమని ఉంగుటూరు పీఎస్ ఎస్సై యు.గోవిందు అన్నారు. మండలంలోని ఇందుపల్లి జడ్పీ హైస్కూల్‌లో 6నుంచి 10వతరగతి విద్యార్థులకు మంగళవారం గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం టి.సుభాషిణి, ఎఫ్ఏసీ ఎం.నాగమల్లేశ్వరరావు, పీడీ వి.జ్యోతి, శక్తిటీం, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు పోటీతత్వం అలవరుచుకోవాలి

ఉయ్యూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశనుంచి చదువు, ఇతర అంశాల్లో పోటీ తత్వం అలవరుచుకుని అన్నింటా విజేతలుగా నిలవాలని ఉయ్యూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టీవీ నాగేశ్వరరావు అన్నారు. వరల్డ్ యూత్ స్కిల్స్ డే పురస్కరించుకుని మంగళవారం పాఠశాలలో విద్యార్థులకు క్విజ్, రోల్‌ప్లే, డ్రాయింగ్, తదితర అంశాలలో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. సుగుణాకర్, ఒకేషనల్ టీచర్లు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

వృద్ధులను ఆదరించడం అభినందనీయం

గన్నవరం, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : వృద్ధులను ఆదరించడం అభినందనీయమని టీడీపీ మండల అధ్యక్షుడు గూడపాటి తులసి మోహన్ అన్నారు. మండలంలోని బుద్ధవరం శివారు రాజీవ్ నగర్ కాలనీకి చెందిన కర్నాటి రామకృష్ణ సాగర్ జ్ఞాపకార్థం అతని తల్లిదండ్రులు నాగార్జున, నాగలక్ష్మిలు వందమంది వృద్ధులకు దుప్పట్లను మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బడుగు బాలమ్మ, పీఏసీఎస్ చైర్ పర్సన్ ముద్రబోయిన శ్రీనివాసరావు, విజయ డైయిరీ డైరెక్టర్ పాలడుగు నాని, టీడీపీ నాయకులు బొప్పిడి దొరబాబు, చేడవరపు ధర్మయ్య, కరిముల్లా, కిరణ్ కుమార్, తాడిపర్తి రజిని, మరియదాసు, కొండా సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి బాలుడి మృతి

పెనమలూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : పోరంకి సెంటరులో షాపుపైన ఫ్లెక్సీలు విప్పుతూ విద్యుత్ షాక్‌కు గురై ఇంటర్ విద్యార్థి మృతి చెందిన ఘటన సోమవారం జరిగింది. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పెనుగంచిప్రోలు మండలం శనగపాడు గ్రామానికి చెందిన బలంత సురేష్ తన ఇద్దరు పిల్లలతో కానూరులో వాచ్‌మన్‌గా పనిచేస్తూ జీవిస్తున్నాడు. తన కుమారుడు బలంత ప్రసాద్(17) ఇంటర్ చదువుతూ ఫ్లెక్సీలు కట్టే పనికి వెళుతుంటాడు. సోమవారం సాయంత్రం పోరంకి సెంటర్లో కార్నర్ స్వీట్ షాపుపైకెక్కి ఫ్లెక్సీలు విప్పుతుండగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు.

యనమలకుదురు కాల్వలో పడి..

యనమలకుదురు పెద్ద వంతెనకు వెళుతున్నానని ఇంట్లో చెప్పి వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తూ కాల్వలో పడి మృతి చెందిన ఘటనపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. యనమలకుదురు ప్రియదర్శిని నగర్‌కు చెందిన బడుగు మధుసూదనరావు(52) పెయింటింగ్ పనులు చేస్తుంటాడు. రెండు రోజుల క్రితం అతడు యనమలకుదురు పెద వంతెన వద్దకు వెళుతున్నానని చెప్పి వెళ్లి కనిపించకుండా పోయాడు. దీంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం కాల్వ కట్ట ఒడ్డున అతని చెప్పులు కనిపించగా కాల్వలో వెతికించారు. చివరకు మధుసూదనరావు మృతదేహం తాడిగడప సమీపంలో కాల్వలో దొరికింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

బెజవాడకూ.. కావాలి అండర్ గ్రౌండ్ కేబుల్స్

● తీగలు మారాలి.. నగరం తీరు మార్చాలి ● అస్తవ్యస్త విద్యుత్ తీగలతో క్షీణిస్తున్న నగర శోభ ● అండర్ గ్రౌండ్ కేబుల్ వ్యవస్థతో అందంగా విదేశీ గ్రామాలు
● సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో ట్రాన్స్‌కో విఫలం ● అండర్ గ్రౌండ్ టన్నెల్ కేబుల్ వ్యవస్థ నగరానికి అత్యవసరం

ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ: ప్రపంచంలోని అనేక చిన్న నగరాలు అండర్‌గ్రౌండ్ కేబుల్ వ్యవస్థతో అభివృద్ధి చెందుతున్నాయి. అటువంటి ప్రణాళికను విజయవాడ నగరంలోనూ అమలు చేస్తే నగర ముఖచిత్రం పూర్తిగా మారిపోతుంది. విజయవాడ నగరం ప్రస్తుతం రాజధానికి ముఖద్వారంగా రోజురోజుకు అభివృద్ధి చెందుతుండగా, విద్యుత్, ఇంటర్నెట్, టీవీ తీగలు నగర అందాన్ని దెబ్బతీస్తున్నాయి. ముఖ్యంగా రోడ్లకు ఇరువైపులా వేలాడుతున్న తీగలు చూడటానికి అసహ్యంగా కనిపించడమే కాదు, ప్రమాదకరంగానూ మారాయి. నగరం రాజధానికి దగ్గరగా ఉండడంతో రాజకీయ ప్రముఖులు, ఉన్నతాధికారుల రాకపోకలకు కేంద్రంగా మారింది. విద్య, పర్యాటకం, ఆధ్యాత్మికతపరంగా విశేష గుర్తింపు పొందిన నగరానికి రోజూ వేలాది మంది సందర్శకులు, భక్తులు, ప్రయాణికులు వస్తుంటారు. అయినా, నగర ముఖచిత్రాన్ని దెబ్బతీసే ఈ కేబుళ్ల వల్ల నగర ప్రతిష్ఠ దిగజారుతోంది. పండిట్ నెహ్రూ బస్టాండ్, రైల్వే స్టేషన్, భవానీద్వీపం, కొండపల్లి ఖిల్లా, గాంధీ హిల్, దుర్గ గుడి వంటి ప్రముఖ ప్రాంతాలకు వచ్చే సందర్శకులకు నగరంలోని ఈ కేబుళ్లు అసహ్యంగా కనిపిస్తున్నాయి. విద్యుత్ సరఫరాకు ఏర్పాటుచేసిన హైటెన్షన్ లైన్‌లు, వీధిలైట్ల సరఫరా లైన్లు రహదారుల కట్టడాన్ని దెబ్బతీయడంతో పాటు, ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారుతున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద నీటి ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడుతుండటంతో ప్రజా జీవనానికి అంతరాయంగా మారాయి. విద్యుత్ చౌర్యానికి వీలుగా రూపొందిన తీగల వ్యవస్థను ఆధునిక సాంకేతికతతో అడ్డుకోవాల్సిన అవసరం ఉంది. ఇటీవల ప్రపంచంలో చిన్న గ్రామాల వరకూ అండర్‌గ్రౌండ్ కేబులింగ్ వ్యవస్థ అమలవుతోంది. ఈ విధానంతో నగరాలు మరింత ఆకర్షణీయంగా మారాయి. విజయవాడ నగరానికి కూడా అలాంటి శాస్త్రీయ సమీకరణలు అవసరం. తుఫాన్లు, వడగాడ్పులు, భారీ వర్షాల సమయంలో విద్యుత్ సరఫరాకు ఆటంకం ఏర్పడకుండా ఉండేందుకు అండర్‌గ్రౌండ్ విద్యుత్ వ్యవస్థ అనివార్యం. పైగా, దీంతో విద్యుత్ చౌర్యానికి పూర్తిగా చెక్ పెట్టవచ్చు. నగరంలో ఇప్పటికే కొన్ని జాతీయ రహదారులకు అండర్‌గ్రౌండ్ విద్యుత్ వ్యవస్థ ఉంది. అయితే వాటి నుంచే పక్కనున్న ప్రాంతాలకు ఓపెన్ తీగల ద్వారా సరఫరా కొనసాగుతోంది. ఒకవైపు ట్రాఫిక్‌కు ఆటంకంగా మారిన విద్యుత్ స్తంభాలు, మరోవైపు ప్రమాదకరంగా వేలాడుతున్న తీగలు నగరాభివృద్ధికి అడ్డుపడుతున్నాయి. ఇప్పటికే గుణదల - నున్న మార్గంలో 140 మీటర్ల పొడవున అండర్‌గ్రౌండ్ కేబుల్స్ ఏర్పాటైనప్పటికీ, నగరవ్యాప్తంగా అమలు చేయడానికి ఎలాంటి ప్రతిపాదనలు ప్రభుత్వం ముందుకు పంపలేదని అధికారులే చెబుతున్నారు. దీనికి ప్రధాన కారణం తవ్వకాలే. సిమెంట్ రోడ్ల నిర్మాణం, అక్రమ నిర్మాణాలు, రహదారి ఆక్రమణలు తవ్వకాలకు అడ్డంగా మారుతున్నాయి. అంతేకాదు, అండర్‌గ్రౌండ్ వ్యవస్థ కోసం అవసరమయ్యే భారీ బడ్జెట్ ప్రభుత్వానికి సవాలుగా మారుతోంది. ఇటువంటి ప్రతికూలతలు ఉన్నా, విజయవాడ నగర భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుంటే అండర్‌గ్రౌండ్ కేబులింగ్ వ్యవస్థ ఇక అనివార్యమని స్పష్టమవుతోంది. ప్రజల సురక్షిత జీవనం, పర్యాటక అభివృద్ధి, విశ్వసనీయ విద్యుత్ సరఫరా కోసం నగర యంత్రాంగం, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలి.



నగరంలో సాలెగూడులా ఉన్న కేబుళ్లు, విదేశీ గ్రామంలో కేబుళ్లు లేని వీధి అందాలు

మీ మార్గదర్శనమే మేలిమి బంగారం

● కలెక్టర్ లక్ష్మీశ ● 245 బంగారు కుటుంబాలను దత్తత తీసుకున్న మహానగర్ లయన్స్ క్లబ్ ● 180 కుటుంబాలను దత్తత తీసుకున్న అమ్మా అసోసియేషన్

కలెక్టరేట్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): సమాజాన్ని పేదరికం నుంచి దూరం చేయాలనే గొప్ప లక్ష్యంతో, ముఖ్యమంత్రి దార్శనికతకు అనుగుణంగా రాష్ట్రప్రభుత్వం వినూత్నంగా ప్రారంభించిన పీ-4 విధానంలో మేము సైతం భాగమంటూ విజయవాడ మహానగర్ లయన్స్ క్లబ్, ఆంధ్రా మోటార్స్ మర్చంట్స్ అసోసియేషన్ (అమ్మా) ముందుకు రావడం అభినందనీయమని, ఈ సంస్థలను స్ఫూర్తిగా తీసుకొని మరింత మంది మార్గదర్శకులుగా ముందుకు రావాలని కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు. పీ-4 విధానం కింద బంగారు కుటుంబాలను దత్తత తీసుకొని ఆ కుటుంబాల అభివృద్ధికి మార్గదర్శిగా వ్యవహరిస్తామని ప్రతిజ్ఞ పత్రాలను ఆయా అసోసియేషన్ల ప్రతినిధులు మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశకు అందచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజం మనకెంతో ఇచ్చింది, తిరిగి మనం సమాజానికి ఏదో ఒకటి చేయాలనే సంకల్పంతో ఇప్పటికే దాదాపు 1500 మంది మార్గదర్శులుగా నమోదయ్యారన్నారు. విజయవాడ మహానగర్ లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ వక్కలగడ్డ భాస్కరరావు, జోన్ చైర్‌పర్సన్ ఎన్‌వీ గుప్తా, కార్యదర్శి ఎల్ నాగబెనర్జీ, పాస్ట్ ప్రెసిడెంట్స్ ఐ లక్ష్మణరావు, కందుల నాగేశ్వరరావు, ఆంధ్రా మోటార్స్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గారపాటి సతీష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సుంకర చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు దోనేపూడి దుర్గాప్రసాద్, జీవీ సుబ్బారావు పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ పత్రాలను కలెక్టర్‌కు అందిస్తున్న మహానగర్ లయన్స్ క్లబ్, ఆంధ్ర మోటార్స్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు

18న మెగా జాబ్‌మేళా

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించే ఉద్దేశంతో ఈనెల 18న విజయవాడ మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. మంగళవారం ఆయన అధికారులతో కలిసి జాబ్‌మేళా కేలెండర్‌తో పాటు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్‌మేళాలో సుమారు 25 కంపెనీలు పాల్గొంటాయన్నారు. టెన్త్ నుంచి పీజీ వరకు చదువు పూర్తిచేసుకున్న 18 నుంచి 35 ఏళ్ల లోపు యువత అర్హులని, ఎంపికైన వారికి మంచి వేతనంతో పాటు ఇతర సౌకర్యాలు ఉంటాయన్నారు. ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలకు ఎంపిక చేస్తారన్నారు. ముందుగా హెచ్‌టీటీపీఎస్://నైపుణ్యం.ఏపీ.జీఓవీ.ఇన్/యూజర్-రిజిస్ట్రేషన్ లింక్‌లో తప్పనిసరిగా రిజిస్టర్ కావడంతో పాటు, సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో రావాలన్నారు. వివరాలకు 9959984226, 9347779032 నెంబర్లను సంప్రదించవచ్చన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్ శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ పీడీ కేఎన్‌వీ నాంచారరావు, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి జ్యోతి పాల్గొన్నారు.

బుక్‌లెట్ ఆవిష్కరణ

ఏపీఐసీ మంగళగిరి స్టేట్ ఇన్‌ఫర్మేషన్ కమిషనర్, గుంటూరు డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఆదేశాల ప్రకారం సమాచార హక్కు చట్టం-2005 గురించి ఎన్టీఆర్ జిల్లాలోని 17 మండలాల్లో అవగాహన సదస్సులు నిర్వహించబడ్డాయని జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి తెలిపారు. అందరు సహాయ వ్యవసాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారులు వీఏఏఎస్, గ్రామ స్థాయి ఉద్యోగులు ఆర్‌టీఐ చట్టం ద్వారా సమాచారం గురించి ప్రజల్లో అవగాహన కల్పించారు.టీ అవగాహన సదస్సులకు సంబంధించిన జిల్లా బుక్‌లెట్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు

ఏనుగులకోడు డ్రెయిన్‌లోకి సాగునీరు

● సాగునీటి తూముల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతా
● రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి


ఏనుగులకోడు డ్రెయిన్‌లోకి వృథాగా పోతున్న బందరు కాలువ నీరు

తోట్లవల్లూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): సాగునీటి తూముల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి తెలిపారు. తోట్లవల్లూరు చిల్లడొంక వద్ద బందరు కాలువ నుంచి నిర్మించిన సాగునీటి తూములు విరిగిపోయి సాగునీరు వృథా అవుతున్న తీరుని మంగళవారం గురుమూర్తి పరిశీలించారు. ఏరిగేషన్ ఏఈ నాగబాబు, స్థానిక రైతులు గుత్తా రామకృష్ణ, గొరిపర్తి రమేష్‌తో కలిసి చర్చించారు. 20 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ తూములు రెండేళ్ల క్రితం విరిగిపోయాయని రైతులు తెలిపారు. వీటిని రైతులు సొంతంగా నిర్మించుకున్నారని, రైతులకు సాగునీరు అందేందుకు వెస్ట్ సైడ్ చానల్ ఉండేదని, అది అనేకచోట్ల ఆక్రమణలకు గురయిందని, ఈ చానల్‌ను వినియోగంలోకి తెస్తే తూముల అవసరం ఉండదని ఇరిగేషన్ ఏఈ నాగబాబు వివరించారు. తూములు పునర్నిర్మాణం అవసరమని రైతులు కోరారు. ఇరిగేషన్ మంత్రి, ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా దృష్టికి తీసుకెళ్లి పునర్నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని గురుమూర్తి రైతులకు హామీ ఇచ్చారు.

సాగునీటి వృథాను ఆపలేరా

ఇదిలా ఉండగా తూముల పునర్నిర్మాణం ఇప్పట్లో సాధ్యమయ్యే పనికాదు. ఎంత ఖర్చవుతుందో అధికారులు అంచనాలు రూపొందించాలి. నిధులు వచ్చినా వచ్చే వేసవిలోనే పనులకు వీలుంటుంది. అప్పటి వరకు వేచి ఉండటం తప్ప మరోమార్గం లేదు. విరిగిన తూముల నుంచి సాగునీరు ఏనుగులకోడు డ్రైన్‌లో కలిసిపోతోంది. ఇలాంటివి మరో రెండు ప్రదేశాల్లో ఉన్నాయి. అక్కడ కూడా సాగునీరు పోతోంది. అందుకే బందరు కాలువ నుంచి వచ్చే సాగునీరు రాకుండా అధికారులు అడ్డుకట్ట వేయాలి. అప్పుడే దిగువ ప్రాంత రైతులకైనా సాగునీరు ఉపయోగపడుతుంది.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

పీ-4 అమలుపై దృష్టి సారించండి

● నియోజకవర్గ ప్రత్యేక అధికారులతో కలెక్టర్ సమావేశం

మచిలీపట్నం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన పీ-4 జిల్లాలో విజయవంతంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ చాంబరులో మంగళవారం స్వర్ణాంధ్ర విజన్-2047 లక్ష్యసాధనలో భాగంగా పీ-4 అమలు, పురోగతిపై నియోజకవర్గాల ప్రత్యేక అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర సచివాలయం నుంచి వచ్చిన ప్రణాళికా విభాగం అసిస్టెంట్ మేనేజర్ దుర్గాప్రసాద్ పీ-4 లక్ష్యాలు, కీలకసూచికలు, వంటి అంశాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అధికారులకు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పేదరికనిర్మూలన కోసం పీ-4ను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. దీని అమలులో సమస్యలుంటే చెప్పాలన్నారు. బంగారుకుటుంబాలను మార్గదర్శిలు ఎంపిక చేసుకునేటప్పుడు ఆన్‌లైన్ పోర్టల్‌లో కుటుంబ యజమాని పేరునే కాకుండా, కుటుంబంలోని అందరి పేర్లు నమోదుచేసి కనపడేలా చూడాలన్నారు. పేద కుటుంబాన్ని ఒక మార్గదర్శి మాత్రమే కాకుండా ఎక్కువమంది ఎంపిక చేసుకునేకునేలా అవకాశం కల్పించాలని, దీనికి అనుగుణంగా పోర్టల్‌లో మార్పులు చేయాలని ప్రణాళికావిభాగం అసిస్టెంట్ మేనేజర్‌కు కలెక్టర్ సూచించారు. నియోజకవర్గాల ప్రత్యేక అధికారులుగా ఉన్న జడ్పీ సీఈవో కన్నమనాయుడు, డ్వామా పీడీ శివప్రసాద్, డీపీవో జే అరుణ, పశుసంవర్ధకశాఖ జేడీ చిన నరసింహులు, మార్కెటింగ్ ఏడీ నిత్యానందం, సీపీవో భీమరాజు పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకునేందుకే వైసీపీ అలజడి

● టీడీపీ పరిశీలకుడు కనపర్తి

అవనిగడ్డ, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నేతృత్వంలో జరుగుతున్న అభివృద్ధిని అడ్డుకునేందుకు వైసీపీ ప్రణాళికాబద్ధంగా అలజడులు సృష్టించే ప్రయత్నం చేస్తోందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు, అవనిగడ్డ టీడీపీ నేత బొబ్బా గోవర్ధన్ అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వారం రోజులుగా మాజీ మంత్రి పేర్ని నాని చేస్తున్న రెచ్చగొట్టే వ్యాఖ్యలను ఖండించారు. చంద్రబాబు వయస్సు గురించి పిచ్చిమాటలు మాట్లాడుతున్నారని, ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని లేకుంటే చెప్పు దెబ్బలు తగుతులాయని హెచ్చరించారు. ఏడాది కాలంలో సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నేతృత్వంలో రాష్ట్రంలో పెట్టుబడుల వరద కొనసాగుతుందని, గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఆశలు కోల్పోయిన యువత నేడు తమ భవిష్యత్ గురించి ధీమాగా ఉన్నారన్నారు. పేదలకు చెందాల్సిన రేషన్ బియ్యాన్ని దిగమింగిన దొంగ పేర్ని నాని అని, కోర్టుకు వెళ్లి నాట్ టు అరెస్టు ఆర్డర్ తెచ్చుకొని దమ్ముంటే అరెస్టు చేసుకోవాలని మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. బిట్స్ పిలాని వంటి సంస్థ రాష్ట్రంలో పెట్టుబడులకు ముందుకొస్తే వాటిని అడ్డుకోవటానికి సామాజిక మాధ్యమాల్లో వైసీపీ విశేష ప్రచారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేర్నీ నానికి అరెస్టు అయ్యేందుకు అంత తొందర ఎందుకన్నారు. టీడీపీ నేతలు కొల్లూరి వెంకటేశ్వరరావు, బండే శ్రీనివాసరావు, మెండు లక్ష్మణరావు, కర్రా సుధాకర్, మేడికొండ విజయ్ పాల్గొన్నారు.

2 నుంచి కాటన్ సీడ్ ఆయిల్, మీల్ సమావేశం

విజయవాడ సిటీ, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కాటన్‌సీడ్, ఆయిల్, మీల్ సమావేశాన్ని విజయవాడలోని వివంత హోటల్‌లో ఆగస్టు 2, 3 తేదీల్లో నిర్వహిస్తున్నట్టు సాల్వెంట్ ఎక్స్‌ట్రాక్టర్ సంఘం (ఎస్ఈఏ), అఖిల భారత కాటన్ సీడ్ క్రషర్ల సంఘం (ఏఐసీవోఎస్‌సీఏ) ప్రతినిధులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పత్తి గింజల ప్రాముఖ్యత, వినియోగం, శాస్త్రీయ విధానాలతో పాటు రైతులకు పశుసంవర్ధక రంగం లాభాలపై విస్తృతంగా ఈ సమావేశంలో చర్చ జరుగుతుందని వివరించారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర పశు సంవర్ధక, పాడి పరిశ్రమల శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు ఈ పాల్గొంటారన్నారు. పత్తి గింజకు కొత్త ప్రాణం-నూనెకు స్థానం, మేతకు ప్రాధాన్యం అనే నినాదంతో ఈ సమావేశం జరుగుతుందని స్పష్టం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి

పీఎం సూర్యఘర్ ప్రయోజనాలు వివరించండి

● ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి

విజయవాడ సిటీ, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పీఎం సూర్యఘర్ ప్రయోజనాలను ప్రజలకు వివరించి పథకం పూర్తిగా అమలయ్యేందుకు చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి ఆదేశించారు. నగరంలోని ఎన్టీఆర్ జిల్లా సర్కిల్ కార్యాలయంలో అధికారులతో ఆయన మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి జాతీయ గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహించాలని సూచించారు. ఆర్‌డీఎస్ఎస్ పథకంలో మండల ప్రాంతాలకు మంజూరైన 33 కేవీ, 11కేవీ వ్యవసాయ ఫీడర్‌ను విభజించే పనులను త్వరగా పూర్తి చేసి గ్రామీణ ప్రాంతాలకు గృహ, పరిశ్రమలకు 24 గంటల నిరంతర ఫేస్-3 విద్యుత్‌ను సరఫరా చేయాలన్నారు.

సరఫరా లైన్లలో అంతరాయాలను తగ్గించేందుకు అవసరమైన సామగ్రిని, సిబ్బందిని సిద్ధం చేసుకోవాలన్నారు. ఏవైనా ఫిర్యాదులొస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. టెక్నికల్ డైరెక్టర్ మురళీకృష్ణయాదవ్, ప్రాజెక్ట్ డైరక్టర్ కేవీఎస్ఎన్ మూర్తి, ఫైనాన్స్ డైరెక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు, ఫైనాన్స్ సీఎంజీ రాందాస్, ఎస్ఈ తోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సస్పెండైన ఉపాధ్యాయుడు విధులకా.!

● డిస్పెన్సరీ కమిటీ రిపోర్టు లేకుండానే సస్పెన్షన్ ఎత్తివేత!
● విచారణ కమిటీ ముందు బాధితుల నిలదీత

ఘంటసాల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ చిట్టీల పేరుతో నగదు వసూలు చేసిన వ్యవహారంలో సస్పెన్షన్‌కు గురైన గద్దె శ్రీనివాసరావును విధుల్లోకి ఎలా తీసుకున్నారని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దాలిపర్రు గ్రామంలోని ఎంపీపీ పా ఠశాల (ఏఏ)లో పనిచేస్తున్న జీ శ్రీనివాసరావు స స్పెన్షన్ ఉదంతంపై డీవైఈవో శేఖర్ సింగ్ ఆధ్వర్యం లో ఘంటసాల ఎంఈవో-1 ఎన్ శివశంకర్ రావు, ఎంఈవో-2 మహమ్మద్ మోమిన్ లంకపల్లి జడ్పీ హైస్కూల్‌లో విచారణ నిర్వహించారు. ఘంటసాల, కొడాలి, చల్లపల్లి, రామానగరం, కోసూరు, విజయవాడకు చెందిన 15 మంది బాధితులు హాజరయ్యారు. చిట్టీలు, రియల్ ఎస్టేట్ రంగాల్లో వ్యాపారాలు సా గించి కోట్లాది రూపాయలు దండుకుని ఐపీ పెట్టి ఉపాధ్యాయుడికి తమను ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. దీంతో 2024లో ఉపాధ్యాయుడు శ్రీనివాసరావును విద్యాశాఖ స స్పెండ్ చేసింది. తర్వాత ఉన్నతాధికారులను సపోర్టుతో తిరిగి వి ధుల్లోకి చేరారని, ఒక్కసారి స స్పెండ్ అయిన తర్వాత డిస్పెన్సరీ కమిటీ రిపోర్టు ఇవ్వకుండా సస్పెన్షన్ ఎలా ఎత్తివేస్తారని బాధితులు ప్రశ్నించారు. ఘంటసాల మండల విద్యాశాఖాధికారి శివశంకర్ రావు అతడికి సపోర్టు చేస్తున్నారని బాధితులు ఆగ్ర హం వ్యక్తం చేశారు. ఈ విషయమై అ నుమానాలున్నాయని పేర్కొన్నారు. రెండు చెక్ బౌ న్స్ కేసులున్నప్పటికీ కోర్టును మ్యానేజ్ చేస్తున్నారన్నారు. ఇక్కడికొచ్చిన తమకందరికీ సుమారు రూ. 1.50 కోట్లు చెల్లించాల్సి ఉందని ఆవేదన వ్యక్తం చేశా రు. ఇప్పటికైనా కలెక్టర్ బాలాజీ, జిల్లా విద్యాశాఖాధికారి రామారావు ఇతడిని విధులను తొలగించి, పూ ర్తి సమగ్ర విచారణ జరిపించి బాధితులకు న్యా యం చేయాలని కోరారు. దీనిపై డీవైఈవో శేఖర్ సింగ్‌ను వివరణకు ఫోన్ చేయగా అందుబాటులోకి రాలేదు.


అధికారులకు తమ ఆవేదనను చెబుతున్న బాధితులు

హౌసింగ్ సొసైటీకి చెంపదెబ్బ

● ఏపీ రెరా కీలక ఆదేశాలు ● ప్లాట్ల కొనుగోలుదారులకు భారీ ఊరట

విజయవాడ లీగల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (ఏపీ రెరా) మంగళవారం సంచలన తీర్పును వెల్లడించింది. కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలు సభ్యుల నుంచి అధిక వసూళ్లకు పాల్పడటం, ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేయకపోవడం వంటి వాటిపై తీవ్రంగా స్పందించింది. కేతనకొండలో ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహ నిర్మాణ సంఘం పేరుతో ఏర్పాటైన సొసైటీలో సభ్యుడైన ఐ నాగవిష్ణు శివకేశవరావు అనే ఫిర్యాదుదారు దాఖలు చేసిన కేసులో ఏపీ రెరా హౌసింగ్ సొసైటీలకు చెంపదెబ్బ లాంటి ఆదేశాలిచ్చింది. రిజిస్టర్ సేల్ డీడ్‌లో పేర్కొన్న ధరకంటే ఎక్కువ మొత్తాన్ని వసూలు చేయరాదు. డెవలప్‌మెంట్ చార్జీల పేరుతో చదరపు గజానికి రూ.1200 అదనంగా వసూలు చేయాలనే డిమాండ్ చట్టవిరుద్ధమని ప్రకటించింది. అలాగే ఫిర్యాదుదారుడి ప్లాట్ నెం.353ను 30 రోజుల్లోగా అప్పగించాలని ఆదేశించింది. ప్లాట్ ధరపై వసూలు చేసిన మొత్తానికి, డిపాజిట్ చేసిన తేదీ నుంచి స్వాధీనం అప్పగించే వరకు 11 శాతం వడ్డీ చెల్లించాలని ఆదేశించింది. కొవిడ్-19 మినహాయింపు కాలం వర్తించదు. సొసైటీల అంతర్గత బైలాస్‌లు లేదా జనరల్ బాడీ తీర్మానాలు, రిజిస్టర్డ్ సేల్‌డీడ్‌లు, రెరా నిబంధనలకు విరుద్ధంగా ఉండకూడదని తేల్చి చెప్పింది. కో ఆపరేటివ్ సొసైటీలు రెరా చట్టం కింద ప్రమోటర్ల కిందకే వస్తాయని, ప్లాట్ కొనుగోలుదారులు 'అలాటీలు' గానే పరిగణించబడతారని, వారి ఫిర్యాదులు రెరా పరిధిలోకి వస్తాయని స్పష్టం చేసింది.

రెరాలో ప్రాజెక్టు నమోదు కాక ముందే ప్లాట్లను ప్రకటించడం, నిధులు సేకరించడం సెక్షన్ 3 (1) నిబంధనల ఉల్లంఘనేనని పేర్కొంది.

22, 23న సీఆర్‌డీఏ ప్రత్యేక పాస్‌పోర్ట్ డ్రైవ్

కలెక్టరేట్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రీజనల్ పాస్‌పోర్ట్ ఆఫీసు సౌజన్యంతో సీఆర్‌డీఏ ఈ నెల 22, 23న అమరావతిలోని తుళ్లూరు సీఆర్‌డీఏ కార్యాలయంలో ప్రత్యేక పాస్‌పోర్ట్ డ్రైవ్ నిర్వహిస్తోంది. రోజుకు 35 మంది నుంచి దరఖాస్తులు స్వీకరించి 70 మందికి పాస్‌పోర్టు జారీ చేయబడుతుంది. పాస్‌పోర్ట్‌ఇండియా.జీఓవీ.ఇన్/పీఎస్‌పీ అధికారిక వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. జూలై 22, 23న స్లాట్ దొరకని పక్షంలో దరఖాస్తుదారులు ఇతర తేదీలను ఎంచుకోవచ్చు. అధికారులు డ్రైవ్ తేదీలకు సర్దుబాటు చేస్తారు. దరఖాస్తుదారులు నిర్ణీత ధ్రువపత్రాలతో జూలై 16, 17న తుళ్లూరు సీఆర్‌డీఏ కార్యాలయంలో సైతం దరఖాస్తుకు సంప్రదించవచ్చు. రూ.1500 చెల్లించి స్లాట్ బుక్ చేసుకొన్న తరువాత జనరేట్ అయిన ఏఆర్ఎన్ నెంబరును సీఆర్‌డీఏ సీనియర్ లైవ్లీహుడ్ స్పెషలిస్ట్ సీహెచ్ శంకర్‌కు అందజేయాల్సి ఉంటుంది. వివరాలకు సీఆర్‌డీఏ ఫెసిలిటేటర్‌ను సంప్రదించవచ్చు లేదా సీహెచ్ శంకర్ - 9848424207కు కాల్ చేయవచ్చు.

'ప్రణామం' కవి సమ్మేళనం వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

విజయవాడ కల్చరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మల్లెతీగ సాహిత్య సేవా సంస్థ ఆధ్వర్యంలో జూలై 20న బందరురోడ్డులోని అంబేద్కర్ స్మృతి వనం ఆవరణలో జరుగనున్న 'ప్రణామం' కవి సమ్మేళనం వాల్‌పోస్టరును కలెక్టర్ లక్ష్మీశ మంగళవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. నగరం నడిబొడ్డున అంబేద్కర్ స్మృతివనం ఆవరణలో డాక్టర్ అంబేద్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం పాదాల చెంతన, రోజంతా జరుగనున్న ఈ కవి సమ్మేళనంలో కలెక్టర్ పాల్గొంటారని, వివిధ ప్రాంతాలకు చెందిన కవులు పాల్గొని భాష, సామాజిక స్పృహ, దేశభక్తి, ప్రపంచశాంతి, పర్యావరణం అంశాలపై తమ కవితల్ని వినిపించవచ్చని మల్లెతీగ అధ్యక్షుడు కలిమిశ్రీ తెలిపారు. పాల్గొన్న కవులందరికీ ప్రశంసా పత్రం, బుక్ ఆఫ్ భారత్ రికార్డ్స్ చిరు జ్ఞాపికతో సత్కారం వుంటుందని, మధ్యాహ్నం భోజన ఏర్పాటు, అంబేద్కర్ స్మృతి వనం పార్కు సందర్శన టిక్కెట్స్ కూడా అందచేస్తామని ఉపాధ్యక్షుడు చొప్పా రాఘవేంద్ర శేఖర్ తెలిపారు.

ఆన్‌లైన్ షాపింగ్ డెలివరీ గోదాముల్లో తనిఖీలు

ఐఎస్ఐ మార్క్ లేని వస్తువుల సీజ్

గన్నవరం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల భద్రత, ఉత్పత్తుల నాణ్యతను పెంపొందించే చర్యల్లో భాగంగా జాతీయ నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం ఐఎస్ఐ గుర్తింపును తప్పనిసరి చేసిందని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) విజయవాడ శాఖ డిప్యూటీ డైరెక్టర్ వివేక్ వర్ధన్‌రెడ్డి తెలిపారు. గన్నవరం మండలం ముస్తాబాద శివారులో ఫ్లిప్‌కార్ట్ గోదాములో సోమవారం రాత్రి తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్లిప్‌కార్ట్, ఇ-కార్ట్, మీషో ఆన్‌లైన్ షాపింగ్ డెలివరీ ఏజన్సీ మదర్ హబ్‌లో దేశవ్యాప్తంగా జరుగుతున్న తనిఖీల్లో భాగంగా బీఐఎస్ తనిఖీలు నిర్వహించి 25 రకాల కంపెనీల ఎలక్ట్రానిక్స్, గ్రోసరీ, టాయ్స్, బీఐఎస్, సీఆర్ఎఫ్, లేబుల్స్ లేకుండా వినియోగదారులకు తరలిస్తున్న వాటిని సీజ్ చేసినట్టు తెలిపారు. ఇండియాలో ఈ-లాజిస్టిక్స్ కంపెనీలైనా ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ వంటి కంపెనీలు లైసెన్స్‌లు లేకుండా, బీఐఎస్, సీఆర్ఎస్ లేని ప్రొడక్ట్స్‌ను ప్రజలకు సరఫరా చేస్తున్నారని సమాచారం రావడంతో తనిఖీలు చేపట్టినట్టు తెలిపారు. క్వాలిటీ లైసెన్స్ ఉన్న వస్తువులను కొనుగోలు చేయాలని సూచించారు. పలువురు బీఐఎస్ అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	99, 107, 118
చికెన్ విత్ స్కిన్	190
చికెన్ స్కిన్‌లెస్	200

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 515

దివ్యాంగుడికి చార్జింగ్ ట్రై సైకిల్

పామర్రు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మొవ్వ మండలం కాజ గ్రామానికి చెందిన దివ్యాంగుడు చిలుమూరి విజయ్‌కి పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా చార్జింగ్ ట్రై సైకిల్‌ను మంగళవారం టీడీపీ కార్యాలయంలో అందజేశారు. టీడీపీ మొవ్వ మండల అధ్యక్షుడు లింగమనేని రామలింగేశ్వరరావు, యార్లగడ్డ శ్రీనివాసరావు, కొక్కిలిగడ్డ బ్రూస్లీ, కలపాల యోహాను తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజాతోపాటు పార్టీ నేతలు, కార్యకర్తలకు విజయ్ కృతజ్ఞతలు తెలిపారు.


దివ్యాంగుడికి ఛార్జింగ్ ట్రై సైకిల్ అందజేస్తున్న ఎమ్మెల్యే కుమార్ రాజా

పేదల సంక్షేమమే కూటమి లక్ష్యం

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, జూలై 15(ఆంధ్రజ్యోతి) : పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలంలోనే అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని, సంక్షేమ పథకాలను అందిస్తున్నామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. మంగళవారం స్థానిక 8,9 వార్డుల్లో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావుతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఇంటికీ సంక్షేమాన్ని అందించడమే చంద్రబాబు సంకల్పమన్నారు. ప్రజాసమస్యలను ప్రత్యేకంగా తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు అమలు చేస్తున్నారని, వచ్చే ఆగస్టు 15వ తేదీ నుండి ఉచిత బస్సు పథకం సైతం ప్రారంభం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సునీల్, నాయకులు లింగం ప్రసాద్, రాంబాబు, ఉమా, సర్కార్, మున్వర్, రఫీ, గడ్డం ప్రకాష్‌దాసు, పట్టపు చిన్న, సత్యసాయి, తదితరులు పాల్గొన్నారు.


అంగన్వాడీ చిన్నారులను పలకరిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల, రావిలు


గోపువానిపాలెంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

పమిడిముక్కల : వైసీపీ ఐదేళ్ల పాలనలో అథోగతి పాలైన రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపేందుకు సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా మంగవారం మద్రివాడు, గోపువానిపాలెం, మంటాడ, తాడంకి గ్రామాల్లో పర్య టించి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఇంటింటా ప్రచారం చేసి, సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ విధ్వంస పాలనతో రాష్ట్రం అన్ని విధాలా నష్టపోయిందన్నారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నప్పటికి సూపర్‌సిక్స్ సంక్షేమ పథకాలు అమలు చేస్తూ చంద్రబాబునాయుడు మాట నిలబెట్టుకుంటున్నారని పేర్కొన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు రాజులపాటి శ్రీనివాసరావు, సీనియర్ నాయకుడు శ్రీనివాసరావు, మైనేని ఇందిర, అబ్బాస్ మీర్జా, తదితరులు పాల్గొన్నారు.


నూతనంగా ఎంపికైన కార్యవర్గం వీరే..

మొవ్వ ప్రాజెక్టు కమిటీ ఏకగ్రీవం

కూచిపూడి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మొవ్వ ప్రాజెక్టు కమిటీ కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ప్రాజెక్టు గౌరవ అధ్యక్షురాలిగా ఎస్.విజయలక్ష్మి, అధ్యక్షుడిగా దగాని రాజారత్నం, కార్యదర్శిగా తాతా శివకుమారి, కోశాధికారిగా సీహెచ్.సునీత ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి రమాదేవి, జిల్లా నాయకులు నాగమణి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.డి.కరీముల్లా పాల్గొన్నారు.

చినముత్తేవి పీఏసీఎస్ చైర్మన్‌గా ప్రకాష్


ప్రకాష్

కూచిపూడి : చినముత్తేవి పీఏసీఎస్ ఛైర్మన్‌గా పెదముత్తేవి గ్రామానికి చెందిన కొసరాజు ప్రకాష్ మాధుర్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సభ్యులుగా మురారి శివనాగరాజు, సుంకర వెంకటేశ్వరరావులను నియమించారు. ఈ సందర్భంగా ఎంపికైన ఛైర్‌పర్సన్, సభ్యులకు టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు లింగమనేని రామలింగేశ్వరరావు అభినందనలు తెలియజేస్తూ రైతు సమస్యల పరిష్కారానికి నూతనంగా ఎంపికైన సభ్యులు కృషి చేయాలని కోరారు

తండ్రి కనిపించడం లేదని ఫిర్యాదు

గుడివాడ : స్థానిక పెద్దవీధికి చెందిన మరడా సాంబశివరావు ఈ నెల 8వ తేదీన ఉంగుటూరులో ఉన్న తన పెద్దకుమారుడు ఇంటికి వెళ్లి వస్తానని వెళ్లి ఆనాటి నుంచి కనిపించడం లేదని కుటుంబసభ్యులు ఫిర్యాదు చేసినట్టు వన్‌టౌన్ సీఐ కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో సీఐ మాట్లాడుతూ గతంలో ఆటోడ్రైవర్‌గా సాంబశివరావు పనిచేశారని, ఎడమ కాలు విరిగి ఇంట్లోనే ఉండటం వల్ల ,తీవ్ర మానసిక ఒత్తిడిని ఎదర్కొంటున్నట్టు తెలిపారు. కుడి చేతిమణికట్టుపై శివలింగం పచ్చబొట్టు ఉంటుందని, కాలు విరగడంతో కుంటుతూ ఉంటాడన్నారు. ఆచూకీ తెలిసినవారు గుడివాడ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ సీఐ 83329 83796, ఎస్సై 94407 96422కు సమాచారం అందించాలని సీఐ శ్రీనివాస్ కోరారు.

ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ జిల్లా కమిటీ సభ్యుడిగా వేణుబాబు

గుడివాడ, జూలై 15(ఆంధ్రజ్యోతి) : ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ జిల్లా కమిటీ సభ్యుడిగా గుడివాడకు చెందిన టీడీపీ నాయకుడు రామదేని వేణుబాబును ఎంపిక చేస్తూ జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు వేణుబాబుకు అభినందనలు తెలిపారు.

ఉచిత నేత్ర వైద్య పరీక్షలు

గుడ్లవల్లేరు: ప్రముఖ పారిశ్రామికవేత్త దివంగత బొప్పన శరత్‌గోపాల్ స్మారకార్థం వారి కుమారుడు బొప్పన శరత్‌గోపాల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు విజ్ఞానజ్యోతి గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్స్ చీఫ్ పాట్రోన్ అయిన బొప్పన తారాచంద్ చే శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న నేత్రవైద్య పరీక్షాశిబిరం మంగళవారం కొనసాగింది.

పూడికతీత పనులు ప్రారంభం

పెదపారుపూడి : మండల పరిధిలోని గురువిందగుంటలో డ్రెయినేజీ పూడికతీత ప్రారంభించినట్టు పంచాయతీ కార్యదర్శి విజయ్ కుమార్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంల నీరు నిల్వ ఉండకుండా డ్రెయినేజీల ద్వారా బయటకు పంపే విధానంలో ప్రొక్లెయినర్ సహాయంతో పని చేయిస్తున్నట్టు ఆయన తెలిపారు. దోమలు నివారణకు ప్రభుత్వ పరంగా బ్లీచింగ్ తదితర క్రిమిసంహారక మందులు పిచికారి చేయనున్నట్టు తెలిపారు.

ఏటీఎస్ ప్రైవేటీకరణను నిలిపివేయాలి

● అడుసుమిల్లి శ్రీనివాస్, గోళ్ల శివ

గుడివాడ, జూలై 15(ఆంధ్రజ్యోతి) : కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు వాహనాల ఫిట్‌నెస్ తనిఖీ చేసే విధానాన్ని ప్రైవేటీకరణ చేసి, ఏటీఎస్(ఆటోమోటెడ్ టెస్టింగ్ సిస్టం) ద్వారా చేసే విధానాన్ని రద్దు చేయాలని ది లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అడుసుమిల్లి శ్రీనివాస్, గోళ్ల శివలు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక రాజేంద్రనగర్‌లోని ఆర్‌టీవో కార్యాలయం వద్ద ది లారీ ఓనర్స్ అండ్ ట్రాన్స్‌పోర్టు, టాక్సీ, ఆటో, ట్రాక్టర్స్, మినీ వ్యాన్ ఓనర్స్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడివాడ ఆర్‌టీవో కార్యాలయ పరిధిలో 6859 రవాణ వాహనాలున్నాయని, మచిలీపట్నంలో ప్రైవేట్ వ్యక్తుల ద్వారా ఏటీఎస్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారన్నారు. అంత దూరం వెళ్లి వాహనాలకు ఫిట్‌నెస్‌లు చేయించాలంటే సమయంతో పాటు డబ్బు వృథా అవుతుందన్నారు. ఫిట్‌నెస్‌కు చలానా కట్టి వెళ్లినా ఏటీఎస్‌లో కారణం లేకుండానే తిరస్కరిస్తున్నారని ఆరోపించారు. అదే విధంగా ఉదయం వెళితే రాత్రి అవుతుందని, దీంతో ఆయిల్ ఖర్చులు, ఇతర ఖర్చులు అధికంగా అవుతున్నాయన్నారు. గుడివాడ పరిధిలోని వాహనాలకు గుడివాడలోనే ఫిట్‌నెస్ చేయించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. బ్రేక్ చేయడానికి ప్రైవేట్ సంస్థలకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ట్రాన్స్‌పోర్టు యజమానులు చేస్తున్న ధర్నాకు ది గుడివాడ ఆటోనగర్ ఇండస్ట్రీయల్ అండ్ ఆటోమొబైల్ వర్కర్స్ యూనియన్ మద్దతు పలికింది. ట్రాన్స్‌పోర్టు యజమానుల అసోసియేషన్ నాయకులు గుత్తా చంటి, రాయపురెడ్డి ప్రసాద్, రామకృష్ణ, రఘు, అద్దాల నాని, మణికంఠ, వివిధ ట్రాన్స్‌పోర్టు యజమానులు, తదితరులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న ట్రాన్స్‌పోర్టు యజమానులు

రైతులు సమగ్ర సస్య రక్షణ చర్యలు చేపట్టాలి

● కె.జ్యోతి రమణి

పామర్రు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సాగుకు సన్నద్ధమైన రైతులు సమగ్ర సస్య రక్షణ చర్యలు పాటించాలని జిల్లా వనరుల కేంద్ర వ్యవసాయ సహాయ సంచాలకులు కె.జ్యోతి రమణి అన్నారు. మండల పరిధిలోని పసుమర్రు,పేరిశేపల్లి గ్రామాల్లో మంగళవారం వ్యవసాయశాఖ అనుబంధ సంస్థల ఆధ్వర్యంలో పోలం పిలుస్తోంది కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా జ్యోతిరమణి మాట్లాడుతూ శాస్త్రవేత్తలు అందించే సలహాలను పాటించడం ద్వారా రైతులు సాగు వ్యయం తగ్గించుకుని అధిక దిగుబడులు సాధించుకోవాలని సూచించారు. రసాయనిక ఎరువులు వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులను వినియోగించడం ద్వారా వేసిన పంటలలో పెట్టుబడులు తగ్గి అధిక దిగుబడులు సాధించేందుకు దోహదపడతాయన్నారు. వరిపైరు పెరుగుదలకు పిచికారిచేసే మందులపై అవగాహన కల్పించారు. భూసారాన్నిపెంచే పచ్చిరొట్ట ఎరువుల ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. పామర్రు ఏడీఏ బి.స్వర్ణలత ప్రభుత్వం అన్నదాతలకు అందించే రైతు సంక్షేమ పథకాల గురించి వివరించి వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల వ్యవసాయధికారిణి వి.శివనాగరాణి ఖరీఫ్ సాగుచేస్తున్న రైతులు తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. అదేవిధంగా ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకం ద్వారా పంటలకు ఇన్సూరెన్సు ఆగస్టు15లోపు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రైతు శిక్షణ కేంద్రం ఏవో బి.పద్మజ, పలువురు రైతులు పాల్గొన్నారు.


రైతులకు సూచనలందిస్తున్న వ్యవసాయ అధికారులు

దేవాలయాల హుండీ లెక్కింపు నేడు

గుడివాడ : గౌరీశంకరస్వామి, వేణుగోపాలస్వామి దేవస్థానాల హుండీల ఆదాయాన్ని ఈ నెల 16వ తేదీన లెక్కించనున్నట్టు ఆ దేవస్థానాల కార్యనిర్వహణాధికారి కందుల వేణుగోపాలరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రైతులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం

● సూరపనేని సత్యనారాయణ

పెదపారుపూడి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘం ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించటం ద్వారా వారి మన్ననలు పొందాలని నూతన పాలకవర్గానికి టీడీపీ మచిలీపట్నం పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు, సూరపనేని వెంకట సత్యనారాయణ సూచించారు. పెదపారుపూడి మండల పరిధిలోని యలమర్రు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘానికి నూతనంగా నియమితులైన పాలకవర్గ సభ్యులు బాధ్యతలు చేపట్టిన సందర్భంగా గ్రామస్థులు వారిని ఘనంగా సత్కరించారు. సహకార సంఘం అధ్యక్షుడిగా నాగుళ్ల శ్రీనివాసరావు, సభ్యులుగా దావులూరి రామకృష్ణ, చిట్టిబొమ్మ శ్రీనివాసరావులు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వారిని టీడీపీ గ్రామ అధ్యక్షుడు సుంకర వెంకట బుచ్చిబాబు, నీటి సంఘం అధ్యక్షులు చెరుకూరి సురేష్, కుదరవల్లి ఉమా తదితరులు పాల్గొని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ రైతులకు సకాలంలో రుణాలు అందించటంతోపాటు ఎరువులు, పురుగుమందులు సరఫరా చేయాలని కోరారు. సహకార పరపతి సంఘం కార్యదర్శి గాయత్రి, రైతులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

మట్టి నమూనా పరీక్షలు తప్పనిసరి

● ఏడీఏ ఎస్.కవిత

గుడివాడ రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రైతులు తప్పనిసరిగా మట్టి నమూనా పరీక్షలు చేయించుకుని, అధిక దిగుబడులు పొందాలని ఏడీఏ ఎస్.కవిత పేర్కొన్నారు. మంగళవారం గుడివాడ మార్కెట్ యార్డులో ఉన్న మట్టి నమూనా కేంద్రంలో ఏవోలతో ఏ విధంగా మట్టి పరీక్షలు చేయాలి, ఏయే మండలాలు త్వరగా పూర్తి చేయాలని, ఎన్ని రోజుల్లో టార్గెట్లు పూర్తి చేయాలన్న అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుడివాడ మార్కెట్ యార్డులో మట్టి నమూనా కేంద్రంలో 23 వేల శాంపిల్స్ పరీక్షించాల్సి ఉంటుందని అన్నారు. మట్టి నమూనా ప్యాకెట్లు ఏయే మండలాల నుంచి వస్తున్నవి అనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన నియమ నిబంధనల ప్రకారం త్వరగా అందిస్తామని తెలిపారు. చాలా మండలాల నుంచి మట్టి నమూనా కేంద్రానికి వస్తున్నాయని, వాటిని క్రోడీకరించి మట్టి పరీక్షలు నిర్వహిస్తామని ఆమె తెలిపారు. భూసార పరీక్షా కేంద్రం అధికారిణి గుమ్మడి సురేఖ, ఏఈవోలు వేలూరు అనిత, డి.అనూష, దుర్గాభవాని పాల్గొన్నారు.


మట్టి నమూనా పరీక్షలను పరిశీలిస్తున్న ఏడీఏ కవిత

నూజెళ్లలో చెరువు వేలం పాట

గుడివాడ రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): గుడివాడ మండలం నూజెళ్ల పంచాయతీలో చెరువుల వేలం పాటలు నిర్వహించామని డిప్యూటీ ఎంపీడీవో జి.శ్రీనివాసరావు తెలిపారు. ఒక చెరువుకు రూ.3 లక్షలు, మరో చెరువు రూ.2 లక్షలకు పాటదారులు పాడుకున్నారు. రెండు సంవత్సరాల లీజుపై ఈ పాట పాడినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యదర్శి వి.హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా .. ఇద్దరికి గాయాలు

పామర్రు: పామర్రు-గుడివాడ ప్రధాన జాతీయ రహదారిపై కొమరవోలు గ్రామం వద్ద అదుపు తప్పి పంటకాల్వలోకి దూసుకెళ్లిన ఆటో ప్రమాద ఘటనలో ఇరువురు గాయపడ్డారు. ప్రయాణికులతో గుడివాడ నుంచి పామర్రు వస్తున్న ఆటో మంగళవారం రోడ్డు పక్కన గల పంటకాల్వలోకి దూసుకు పోయింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న ప్రయాణికుల్లో ఇరువురు గాయపడ్డారు. స్థానికుల సమాచారంతో వారిని 108 ద్వారా గుడివాడ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. మిగిలిన ప్రయాణికులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలతోపాటు గాయపడ్డవారి వివరాలు సేకరిస్తున్నారు.


స్పోర్ట్స్ స్కాలర్‌షిప్‌ను అందుకుంటున్న వినీషా

ఖోఖో క్రీడాకారిణికి రూ.50వేల స్పోర్ట్స్ స్కాలర్‌షిప్

గుడివాడ: గుడివాడ ఎస్‌పీఎస్ మున్సిపల్ ఉన్నత పాఠశాల డి.వినీషా 2025-26 సంవత్సరంలో ఖో-ఖో క్రీడాకారిణిగా అత్యున్నత ప్రతిభ కనబరచినందుకు రూ.50వేల స్పోర్ట్స్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు ఖో-ఖో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మడకా ప్రసాద్ తెలిపారు. గన్నవరంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన హెచ్.సి.ఎల్ ఫౌండేషన్ అందించిన స్కాలర్‌షిప్‌ను వినీషా అందుకున్నట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక ఎస్‌పీఎస్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో వినీషాను ఖో-ఖో సంఘం ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, కార్యదర్శి మద్దినేని సత్యప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, వ్యాయామోపాధ్యాయులు కిరణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

● విజిలెన్స్ డీఎస్పీ యు.బంగార్రాజు

గుడివాడ రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు సక్రమంగా రైతులకు అందటానికి కృష్ణా జిల్లాలో రెండు రోజుల నుంచి షాపులు తనిఖీ చేస్తున్నట్టు విజిలెన్స్ డీఎస్పీ యు.బంగార్రాజు అన్నారు. మంగళవారం గుడివాడలో రెండు హోల్ సేల్, ఒక రిటైల్ షాపును రాజమండ్రి నుంచి వచ్చి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు షాపుల్లో ఎరువులకు సంబంధించి రూ.1,40,735లు, పురుగు మందులకు సంబంధించి రూ.2,23,330ల విలువ గల అమ్మకాలు నిలుపుదల చేసినట్టు తెలిపారు. రశీదులు సక్రమంగా లేకపోవటంతో వీటిని నిలుపుదల చేశామని తెలిపారు. రాష్ట్ర కమిషన్ ఆదేశాల మేరకు విజిలెన్స్ తనిఖీలు జరుగుతున్నాయన్నారు. సరసమైన ధరలకు రైతులకు ఎరువులు, పురుగు మందులు అందజేసేందుకు తనిఖీలు చేస్తున్నామని తెలిపారు. నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు రేషన్ డీలర్లు రైతులకు అందించాలని కోరారు. ఎవరైనా ఎక్కువ రేట్లకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు తప్పనిసరిగా రశీదులు భద్రపర్చుకోవాలని కోరారు. డీఆర్సీ రాజమహేంద్ర, ఏడీఏ పి.చంద్రశేఖర్‌రావు, ఏడీఏ కె.శ్రీనివాసరావు, గుడివాడ మండల వ్యవసాయాధికారిణి బోలెం అనంతలక్ష్మి పాల్గొన్నారు.


తనిఖీ చేస్తున్న రాజమండ్రి డీఎస్పీ, విజిలెన్స్ అధికారులు

స్మార్ట్‌మీటర్లు బిగించొద్దు : సీపీఎం

గుడివాడ, జూలై 15(ఆంధ్రజ్యోతి) : స్మార్ట్ మీటర్‌ల వల్ల కలిగే నష్టాలను ప్రజలకు తెలియజేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ఆర్‌సీపీ రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఎన్టీఆర్ కాలనీలో ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం స్థానిక శ్రీనివాస్ సెంటర్ లో ముఠా కార్మికులు ధర్నా నిర్వహించారు. తమ ఇళ్లకు స్మార్ట్‌మీటర్లను బిగించొద్దని కార్మికులు తేల్చి చెప్పారు. సీపీఎం సభ్యులు పి.రజిని, సురేంద్ర, నాగేశ్వరరావుపాల్గొన్నారు.

కొబ్బరి మొక్కలు నాటే కార్యక్రమం

గుడ్లవల్లేరు : లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో లయన్స్ వాకింగ్ ట్రాక్ ప్రాంగణంలో కొబ్బరిమొక్కలను మంగళవారం నాటారు. లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ వైపీసీ ప్రసాద్ వితరణతో ఈ మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. పెరుమాళ్లరావు పాల్గొన్నారు.

పీ4 సర్వేను విజయవంతం చేయాలి

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము


దాతను అభినందిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

గుడివాడ రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): దొండపాడుకు చెందిన ఉప్పాల ప్రవీణ్ కుమార్ ఉచితంగా 50 వేల విలువ గల చెక్కును అందజేయటం సంతోషకరమైన విషయమని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. మంగళవారం దొండపాడు గ్రామానికి చెందిన ఉప్పాల ప్రవీణ్ కుమార్ పశుసంవర్ధక శాఖ జేడి ఎంసిహెచ్.నరసింహులు ఆధ్వర్యంలో రూ.30 వేలు విలువ గల పెయ్యదూడల ఉత్పత్తి పథకానికి పీ4 సర్వే కింద చెక్కును అందజేశారు. ఈ చెక్కును గన్నవరం పశుసంవర్ధక శాఖ కార్యాలయానికి పంపించి 200 డోసుల పెయ్య దూడల పథకం ఉత్పత్తి కింద చెమన్‌ను దొండపాడుకు అందజేశారు. దొండపాడులోని రైతుల పెయ్య దూడలకు సూది ద్వారా అందజేయటం జరుగుతుంది. వీటి వల్ల మేలు జాతి పెయ్యదూడలు పుట్టించటం, పాల ఉత్పత్తి దిగుబడి పెంచటం, రైతులకు ఆదాయం చేకూరుతుందని తెలిపారు. ప్రతీ గ్రామంలో పీ4 సర్వేకు దాతలు సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. గుడివాడ నియోజకవర్గంలో పీ4 దాతలకు ముందుకు రావాలని కోరారు. పశుసంవర్థక శాఖ జేడి ఎంసిహెచ్.నరసింహులు, పశుసంవర్థక శాఖ డీడీ శ్రీనివాసులు, మండల పశువైద్యాధికారి హనుమంతరావు పాల్గొన్నారు.

పెదపారుపూడి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన పీ4 సర్వే విజయవంతం కావటానికి మండలంలోని ముఖ్య నేతలు సహకరించాలని పెదపారుపూడి ఎంపీడీవో విమాదేవి కోరారు. మంగళవారం మధ్యాహ్నం పెదపారుపూడి మండల పరిషత్ కార్యాలయంలో టీడీపీ మండల అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి ఆధ్వర్యంలో మండలంలోని బీసీ నాయకులతో సమావేశం నిర్వహించారు. పీ4 కింద మండలంలో బంగారు కుటుంబాలతో మ్యాప్ చేయబడిన మార్గదర్శకుల జాబితాను ఈ నెల 25వ తేదీలోపు అన్ని గ్రామాల్లో గ్రామసభలు జరిపి సోషల్ ఆడిట్ నిర్వహించనున్నామన్నారు. మండలంలోని మార్గదర్శకులు ముందుకు వచ్చి బంగారు కుటుంబాలను దత్తత తీసుకునే విధంగా నాయకులు గ్రామాల్లో సహకరించాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వంగా శ్రీనివాసరావు, మండల ముఖ్య నాయకులు మసిముక్కు రాంబాబు, దానబోయిన వెంకట నారాయణ, గోగం రామారావు, గొరిపర్తి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలోమాట్లాడుతున్న ఎంపీడీవో విమాదేవి

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	99, 107, 118
చికెన్ విత్ స్కిన్	190
చికెన్ స్కిన్‌లెస్	200

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 515



విత్తనశుద్ధి తప్పనిసరి

మచిలీపట్నం టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : రైతులు తప్పకుండా విత్తనశుద్ధి చేసి నారుమళ్లు పోయాలని మండల వ్యవసాయ శాఖాధికారి మాడుగుల రామ్‌కుమార్ సూచించారు. వాడపాలెం, పెదయార గ్రామాల్లో మంగళవారం పొలంబడి నిర్వహించారు. రైతులకు విత్తనశుద్ధిపై అవగాహన కల్పించారు. నారు తీయడానికి 10 రోజులు ముందుగా కార్బోఫ్యూరాన్ గుళికలు వేయాలన్నారు. వ్యవసాయ సిబ్బంది ఆంజనేయులు, స్టాన్లీ పాల్గొన్నారు.



మధ్యవర్తిత్వంపై జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఆరో అదనపు జిల్లా న్యాయాధికారి పాండురంగారెడ్డి

మధ్యవర్తిత్వం.. పరిష్కారానికి చక్కటి మార్గం

అవనిగడ్డ రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : మధ్యవర్తిత్వం ద్వారా కేసులు త్వరితగతిన పరిష్కరించుకోవచ్చునని ఆరో అదనపు జిల్లా జడ్జి పి.పాండురంగారెడ్డి పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సనకా రఘురామ ప్రసాద్ అధ్యక్షతన మధ్యవర్తిత్వం ద్వారా కేసుల పరిష్కారంపై జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాండురంగారెడ్డి పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కొంత మందికి శిక్షణ ఇచ్చి మధ్యవర్తిత్వం చేసే విధంగా సమాయత్తం చేశామన్నారు. మధ్యవర్తిత్వం వహించే వ్యక్తి నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. మధ్యవర్తిత్వంతో త్వరితగతిన న్యాయం సమకూరుతుందని, ఇందుకోసం ఎలాంటి ఖర్చు చేయాల్సిన అవసరం లేదన్నారు. పీడీఎం స్వర్ణలత, మధ్యవర్తిత్వ సభ్యులు కొండవీటి ఈశ్వరరావు, తోట వీరబాబు, తహసీల్దార్ కె.నాగమల్లేశ్వరరావు, ఎంపీపీ తుంగల సుమతిదేవి, ఎంపీడీవో మరియ కుమారి, ఏజీపీ నరహరిశెట్టి ఈశ్వరరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.



పీఆర్సీ వర్తింపు కోరుతూ రిటైర్డ్ ఉద్యోగుల ధర్నా

మచిలీపట్నం టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : రిటైర్డ్ ఉద్యోగులకు పీఆర్సీ వర్తింపులో తాత్సారాన్ని నిరసిస్తూ కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద రిటైర్డు ఉద్యోగుల సంఘం, పోలీసు ఉద్యోగుల సంఘం నాయకులు మంగళవారం ధర్నా నిర్వహించారు. సంఘం రాష్ట్ర నాయకులు జి. రామస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.వి.ప్రసాదరావు, ఎన్జీవోల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బి.వి. సుబ్బారావు, గుడివాడ సంఘం నాయకులు బి.శంకరరావు, అవనిగడ్డ సంఘం నాయకులు రామకృష్ణ, చల్లపల్లి సంఘ నాయకులు అజీజ్, పోలీస్ ఆఫీసర్ల సంఘం నాయకులు వై శ్రీనివాసరావు, శంకర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు. రిటైర్డు ఉద్యోగులు, ఉపాధ్యాయులకు అందాల్సిన డీఏ బకాయిలు చెల్లించాలని, హెల్త్ కార్డు ద్వారా ఉచిత వైద్య సదుపాయాలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టర్ బాలాజీ కి వినతిపత్రం సమర్పించారు.

యోగా పోటీలకు కలెక్టర్‌కు ఆహ్వానం

మచిలీపట్నం టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 19న ఉయ్యూరులో నిర్వహించనున్న జిల్లా స్థాయి యోగా పోటీలకు రావాల్సిందిగా కోరుతూ జిల్లా యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణ మంగళవారం ఆహ్వానపత్రం అందజేశారు. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ కేటగిరీలలో విడివిడిగా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. పోటీల్లో పాల్గొనే వారు 19వ తేదీ ఉదయం 8 గంటలకు గండిగుంట దత్తాశ్రమానికి హాజరు కావాలన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 9502876748కి ఫోన్ చేసి తమ పేర్లను రిజిస్టరు చేయించుకోవచ్చన్నారు. స్పాట్ రిజిస్ట్రేషన్ కూడా ఉంటుందన్నారు. ఈ పోటీల విజేతలు చిత్తూరులో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరయ్యే అవకాశం ఉంటుందన్నారు.



కలెక్టర్ బాలాజీకి ఆహ్వానపత్రిక అందజేస్తున్న యోగా మాస్టర్ కృష్ణ

ప్రమాదాల నివారణకు రేడియం డ్రమ్ముల ఏర్పాటు

ఘంటసాల, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ఎస్పీ ఆర్.గంగాధర్ ఆదేశాల మేరకు డీఎస్పీ తాళ్లూరి విద్యశ్రీ ఆధ్వర్యంలో రహదారి ప్రమాదాల నివారణే లక్ష్యంగా రేడియం స్టిక్కర్లతో కూడిన ప్లాస్టిక్ డ్రమ్ములను ఏర్పాటు చేసినట్లు చల్లపల్లి సీఐ ఈశ్వరరావు, ఎస్సై ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఘంటసాల పోలీస్ స్టేషన్ పరిధిలోని లంకపల్లి, జీలగలగండి గ్రామాల మధ్యంలో వాహనదారుల వేగాన్ని నియంత్రించేందుకు ప్లాస్టిక్ డ్రమ్ములపై రేడియం స్టిక్కర్లు అతికించి ఏర్పాటు చేశామన్నారు. రాత్రి సమయాల్లో కూడా స్పష్టంగా కనిపించే విధంగా వేగం నియంత్రించేలా స్టిక్కర్లను ఏర్పాటు చేశామన్నారు. వాహనదారులు వేగాన్ని నియంత్రించుకుని సురక్షిత ప్రయాణం చేయాలని సూచించారు.



లంకపల్లి వద్ద డ్రమ్ములు ఏర్పాటు చేస్తున్న పోలీసులు



మార్కెట్ యార్డు డైరెక్టర్ చోడవరపు లక్ష్మీప్రసూనను సత్కరిస్తున్న బ్రాహ్మణ సంఘాల నాయకులు

బ్రాహ్మణులకు కూటమి ప్రభుత్వంలో సరైన గుర్తింపు

మచిలీపట్నం టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : బ్రాహ్మణులకు కూటమి ప్రభుత్వంలో సరైన గుర్తింపు ఇస్తూ మంత్రి కొల్లు రవీంద్ర మచిలీపట్నం మార్కెట్ యార్డు డైరెక్టర్ పదవి తనకు ఇచ్చారని చోడవరపు లక్ష్మీప్రసూన అన్నారు. బ్రాహ్మణ సంఘ నాయకురాలు అంబటిపూడి నాగలక్ష్మి ఆధ్వర్యంలో ప్రసూనను మంగళవారం ఘనంగా సత్కరించారు. బ్రాహ్మణ సంఘ మహిళా ప్రతినిధి పి. విమలా గాయత్రి, ఎం. ఉమాదేవి, కె. కళాధరి, కె. మాధురి, ఎం.పద్మావతి, ఎం. లక్ష్మీసౌజన్య, కానుకొలను అనుపమ, బ్రాహ్మణ సంఘ నాయకులు పి.వి. ఫణికుమార్, ఫణికిరణ్, మోపర్తి సుబ్రహ్మణ్యం, కాపవరపు చంద్రశేఖర్, పోతరాజు శివరామశర్మ పాల్గొన్నారు.

టీడీపీ నేత భాస్కరరావుకు మాతృవియోగం

నాగాయలంక, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : సీనియర్ టీడీపీ నేత సైకం విజయభాస్కరరావు మాతృమూర్తి వెంకటరత్నం (83) సోమవారం రాత్రి గుండెపోటుతో ఏటిమొగలో మృతి చెందారు. ఆమెకు ఐదుగురు కుమారులు ఉన్నారు. ఆమె భౌతికకాయాన్ని ఎంపీటీసీ సభ్యుడు లంకే శ్రీనివాస ప్రసాద్, నాయుడు అంజయ్య మంగళవారం సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



ఏజే కళాశాలలో మెగా జాబ్‌మేళా ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర



పీ-4పై మాట్లాడుతున్న పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్



చల్లపల్లిలో ఎక్స్‌రే యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

30 కంపెనీలతో మెగా జాబ్‌మేళా

మచిలీపట్నం టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : మెగా జాబ్‌మేళాను యువత సద్వినియోగం చేసు కోవాలని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఆంధ్రజాతీయ కళాశాల ప్రాంగణంలో బుధవారం జరిగే జాబ్‌మేళాలో 30 కార్పొరేట్ కంపెనీల ప్రతినిధులు హాజరై ఉద్యోగావకాశాలు కల్పిస్తారన్నారు. మెగా జాబ్‌మేళా ఏర్పాట్లను మంగళవారం మంత్రి కొల్లు రవీంద్ర పరిశీలించారు. 20 కౌంటర్లను ఏర్పాటు చేస్తామని, ఎనిమిదో తరగతి నుంచి బీటెక్, పీజీ చేసిన అభ్యర్థుల వరకు ఇంటర్వ్యూలు చేసి ఉద్యోగాలిస్తారని కొల్లు రవీంద్ర అన్నారు. ఇంటర్వ్యూలకు ఎలా హాజరుకావాలో రెండు రోజుల పాటు ఆంధ్ర జాతీయ కళాశాల ప్రాంగణంలో శిక్షణ తరగతులు కూడా నిర్వహించామన్నారు.

మచిలీపట్నంలో మొట్టమొదటిసారిగా మెగా కంపెనీల ప్రతినిధులు హాజరవడం నిరుద్యోగులకు ఒక వరమన్నారు. తక్కువ చదువు చదువుకున్నామని అనుకోకుండా నిరుద్యోగ యువతీ యువకులు, ఐటీఐ, పాలిటెక్నిక్ ఉత్తీర్ణులు కూడా ఈ జాబ్‌మేళాకు హాజరు కావాలన్నారు.

తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు హసీంబేగ్, నగర టీడీపీ అధ్యక్షుడు లోగిశెట్టి వెంకటస్వామి, మార్కెట్ యార్డు చైర్మన్ కుంచే నాని, ఎండి ఇలియాస్ పాషా, కొల్లు పునీత్ పాల్గొన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే యువతీ యువకులకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని మంత్రి రవీంద్ర సూచించారు. కమిషనర్ బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

పేదరికం లేని రాష్ట్రమే లక్ష్యం : కాగిత

పెడన రూరల్ : పేదరికం లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం పీ-4 విధానాన్ని అమలు చేస్తోందని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ అధ్యక్షతన అధికారులతో పీ-4పై నియోజకవర్గ స్థాయి సమావేశం మంగళవారం జరిగింది. నియోజకవర్గ ఇన్‌చార్జ్, జడ్పీ సీఈవో కన్నమనాయుడు మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయిలో 7500 మంది బంగారు కుటుంబాలను గుర్తించామన్నారు. వారిని దత్తత తీసుకుని, వృత్తి, ఉద్యోగం, ఆదాయ వనరులను పెంపొందించేందుకు మార్గదర్శకులుగా స్వచ్ఛంద సంస్థలు, మిల్లర్లు, వ్యాపారస్తులుముందుకొచ్చారన్నారు. బంగారు కుటుంబ సభ్యుల జీవన స్థితి గతులను సమీక్షిస్తూ, వారి జీవితాలలో వెలుగులు నింపాలన్నారు. దశలవారీగా పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తుందన్నారు. అందరం కలసికట్టుగా పనిచేసి స్వర్ణాంధ్రను సాకారం చేద్దామన్నారు. డీఎల్‌పీవో పద్మావతి, ఎంపీడీవో ఎ అరుణకుమారి, ఏవో శివప్రసాద్, గూడూరు, పెడన, బంటుమిల్లి, కృత్తివెన్ను ఎంపీడీవోలు, తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

దక్షిణ చిరువోలులంకలో..

అవనిగడ్డ రూరల్ : రాష్ట్రంలో సుపరిపాలన సాగుతోందని టీడీపీ మండల అధ్యక్షుడు యాసం చిట్టిబాబు పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మంగళవారం దక్షిణ చిరువోలులంక లో ఇంటింటికి కరపత్రాలను పంపిణీ చేశారు. లక్ష్మణరావు, బచ్చు మురళీ, దేవాలారాజు, బాలకోటేశ్వరరావు, బచ్చు నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, కొక్కిలిగడ్డ సత్యనారాయణ, కమ్మిలి వెంకటేశ్వరరావు, రాంబాబు, సాయిబాబు, గోపాలరావు, రఘునాథ్‌ప్రసాద్, శివరావు, అడపా వెంకటేశ్వరరావు, ప్రకాశం, తుంగల సుధా, మండలి వెంకటేశ్వరరావు, చిన్నా, విశ్వనాథుని మురళీ, అన్నపరెడ్డి సత్యనారాయణ, దాసినేని శ్రీనివాసరావు, రామదాసు, బడే సుబ్బారావు, బాబురావు, బేగ్ పాల్గొన్నారు.

చల్లపల్లి ఆసుపత్రి స్థాయిని 50 పడకలకు పెంచుతాం : ఎమ్మెల్యే మండలి

చల్లపల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లి ప్రభుత్వాసుపత్రిని 50 పడకలకు అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. రూ.10 లక్షలతో ఏర్పాటు చేసిన రెండు ఎక్స్ రే యంత్రాలు, రేడియోగ్రఫీ సేవలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఆసుపత్రి మెడికల్ వ్యర్థాల నిల్వలకు ఏపీ ఎంఐఎస్‌డీసీ నిధులతో నిర్మించిన బయోమెడికల్ వేస్ట్ గదులను పరిశీలించారు. ఆసుపత్రి ఆవరణలో మొక్కలు చికిత్స పొందుతున్న రోగులను, పాముకాటు బాధితులను పరామర్శించారు. అనంతరం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆసుపత్రి సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. పాముకాటు వ్యాక్సిన్, గుండెపోటు సమయంలో చేయాల్సిన ఖరీదైన ఇంజక్షన్ అందుబాటులో ఉన్నాయన్నారు. చల్లపల్లి ఆసుపత్రి వైద్యులు ఉత్తమ సేవలు అందిస్తున్నారని ప్రశంసించారు.

ఈ సమావేశంలో సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, వైస్‌ఎంపీపీ మోర్ల రాంబాబు, డైరెక్టర్లు వరదా హరిగోపాల్, ఎస్.కృష్ణవేణి, సూపరింటెండెంట్ డాక్టర్ బి.ఎస్.శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు మేకా బంగారుబాబు, సీఐ కె.ఈశ్వరరావు, ఎస్ఐ పిఎస్‌వి.సుబ్రహ్మణ్యం, ఈవో పి.వి.మాధవేంద్రరావు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కొల్లిపర మధు, ఉడత్తు బాబు, తమ్మన సతీష్, కస్తూరి ప్రసాద్, కూటమి నేతలు మోర్ల శివ, రావి రాజు, బొందలపాటి వీరబాబు, షేక్ నసీంఫోరి, గంగిశెట్టి రాజేంద్ర, అడపా రవి, ఉరిమి మణికాంత్, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏసీ కంప్రెసర్ నుంచి మంటలు

● ఇండియన్ బ్యాంక్ మేనేజర్ కుటుంబం సురక్షితం

అవనిగడ్డ, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : అవనిగడ్డ స్టేట్ బ్యాంక్ రోడ్డులోని ఏ1 మార్ట్ నాల్గవ అంతస్తులో ఆకస్మాత్తుగా ఏసీ కంప్రెసర్ నుంచి మంటలు వ్యాపించాయి. ఇండియన్ బ్యాంక్ మేనేజర్ భార్య నిద్రిస్తున్న ఇద్దరు చిన్నారులతో బయటకు వచ్చి ప్రాణాలను రక్షించుకున్నారు. ఏసీ మెకానిక్‌ను పిలిచి సర్వీసింగ్ చేయించిన కొద్ది గంటల వ్యవధిలోనే బెడ్ రూమ్‌లోని ఏసీ నుంచి మంటలు వ్యాపించి డబుల్ బెడ్‌రూమ్, అందులోని ఫర్నీచర్ సహా పలు ఖరీదైన ఆభరణాలు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. అవనిగడ్డ, రేపల్లె ఫైర్ సిబ్బంది సకాలంలో స్పందించి రెస్క్యూ ఆపరేషన్ సమర్థంగా నిర్వహించారు. ఎటువంటి ప్రాణ నష్టం లేకుండా మంటలు అదుపులోకి తీసుకువచ్చారు. సుమారు మూడు గంటల రెస్క్యూ ఆపరేషన్ అనంతరం స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

పంటకాల్వలో శవం

అవనిగడ్డ రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : వేకనూరు వద్ద పంట కాల్వలో గుర్తు తెలియని మృతదేహం ఉండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుని షర్టుపై పామర్రు సుప్రియ టైలర్స్ లేబుల్ ఉంది. మృతుడు లైట్ కలర్ చారల షర్టు, నిండు పచ్చరంగు ప్యాంటు ధరించి ఉన్నాడని, ఆచూకీ తెలిసిన వారు అవనిగడ్డ పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అవనిగడ్డ సీఐ సెల్ నెం. 9440796466, ఎస్సై సెల్ నెం.9440796467కు తెలియ జేయాలన్నారు.

డైట్ అధ్యాపకులు మోడల్ పాఠశాల సందర్శన

చల్లపల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లి నారాయణరావు నగర్ మోడల్ పాఠశాలను అంగలూరు డైట్ కళాశాల అధ్యాపకులు చండిక వేణుగోపాల్ మంగళవారం సందర్శించారు. విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయుల హాజరు, కిట్స్ వినియోగం, మధ్యాహ్న భోజనం, కొత్త విద్యార్థుల చేరిక, పాఠశాల నుంచి వెళ్లినవారు ఏ ఏ పాఠశాలల్లో చేరారు తదితర వివరాలను తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి పిల్లలతో కలిసి భోజనం చేశారు. పాఠశాలలో 92 మంది విద్యార్థులు ఉండటంతో వేసవి సెలవుల్లో విద్యార్థులను పాఠశాలలో చేర్చుకునేందుకు చేసిన ప్రచార కార్యక్రమాల గురించి తెలుసుకున్నారు. వేణుగోపాల్ మాట్లాడుతూ, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగ్రహీత పాఠశాల అనిపించేలా పాఠశాల ప్రగతి ఉందన్నారు. ఎంఈవోలు కె.సుజాత, పి.వెంకటేశ్వరరావు, హెచ్‌ఎం కైతేపల్లి దాస్ (నేషనల్ అవార్డీ), ఉపాధ్యాయులు దుర్గాప్రసాద్, రాధారాణి, విజయదుర్గ, బుల్లియ్య పాల్గొన్నారు.



నారాయణరావు నగర్ పాఠశాలలో విద్యార్థులతో భోజనం చేస్తున్న వేణుగోపాల్



ఏఐపై శిక్షణలో ప్రతిభ చూపిన విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఆదిత్య

యువత నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

మచిలీపట్నం టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : యువత నైపుణ్యాలను పెంపొందించుకుంటూ వివిధ రంగాల్లో రాణించాలని స్టార్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.ఎల్.ఆదిత్య అన్నారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వశాఖ, మేరా యువభారత్, మై భారత్, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ సంయుక్తంగా మంగళవారం మచిలీపట్నం పద్మావతి మహిళా డిగ్రీ కళాశాలలో వరల్డ్ యూత్ స్కిల్ డే సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, వెబ్ డిజైన్ యాప్ డెవలప్‌మెంట్‌లపై ఆదిత్య శిక్షణ తరగతులు నిర్వహించారు. ఏఐ ఆధారిత కోర్సులను విద్యార్థులు నేర్చుకోవాలన్నారు. ఆకునూరి శ్వేత, పి. రాము తదితరులు పాల్గొన్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు ఆదిత్య ప్రశంసాపత్రాలు అందజేశారు.



పదో వార్డు సచివాలయంలో ఖాళీగా ఉన్న కుర్చీలు

వార్డు సచివాలయాలు వెలవెల

మచిలీపట్నం టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగుల బదిలీల నేపథ్యంలో వార్డు సచివాలయాలు వెలవెలపోతున్నాయి. మచిలీపట్నం నగర పరిధిలోని వార్డు సచివాలయాల్లో సచివాలయ కార్యదర్శులు తమ సీట్లలో కనపడటం లేదు. సుకర్లాబాద్‌లోని 10వ డివిజన్ సచివాలయంలో ఇద్దరు ముగ్గురు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఖాళీ కుర్చీలు కన్పిస్తున్నాయి. దరఖాస్తులు సమర్పించుకునేందుకు వచ్చిన ప్రజలు సిబ్బంది అందుబాటులో లేక వెనుదిరిగి వెళుతున్నారు.

లాటరీ టికెట్ల విక్రేతల అరెస్టు

మచిలీపట్నం టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం నగరంలో నిషేధిత లాటరీ టికెట్లు అమ్ముతున్న వ్యాపారులపై మంగళవారం రాత్రి స్పెషల్ బ్రాంచ్ టీమ్‌తో డీఎస్పీ రాజా దాడులు జరిపారు. ఏడుగురు లాటరీ టికెట్ల విక్రేతలను అరెస్టు చేశారు.

డ్రోన్ కెమెరాలతో కళాశాలల వద్ద ఆకతాయిల గుర్తింపు..కౌన్సెలింగ్

మచిలీపట్నం టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం లేడీయాంప్తిల్ కళాశాల, చైతన్య కళాశాల వద్ద డ్రోన్ కెమెరాలతో ఆకతాయిలను మంగళవారం పోలీసులు గుర్తించారు. లేడీయాంప్తిల్ కళాశాల వద్ద 10 మంది, చైతన్య కళాశాల వద్ద నలుగురు ఆకతాయిలను గుర్తించి మహిళా పోలీసు స్టేషన్‌కు తరలించారు. మహిళా పోలీసు ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు శక్తి టీమ్ సిబ్బందితో ఆకతాయిలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. పునరావృతమైతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

బి.సరోజాదేవి మృతికి బుద్ధప్రసాద్ సంతాపం

అవనిగడ్డ, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ సినీ నటి బి.సరోజాదేవి మృతికి ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సంతాపం తెలిపారు. అవనిగడ్డలో మంగళవారం ఆయన మాట్లాడుతూ బెంగుళూరులో తెలుగు విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో శ్రీకృష్ణదేవరాయ పురస్కారాన్ని సరోజాదేవికి అందించే అవకాశం తనకు కలిగిందన్నారు. ఆమె మరణ వార్త బాధించిందన్నారు. ఆమె ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు. ఆమె మృతి పట్ల సంతాపం, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

పాలిసెట్ చివరి కౌన్సెలింగ్ 18 నుంచి

పెడన రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : పాలిసెట్-2025లో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు చివరి కౌన్సెలింగ్ ఈనెల 18వ తేదీ నుంచి 20వ తేదీ వరకు విజయవాడలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరుగుతుందని, వెబ్ ఆప్షన్ ప్రక్రియ నందమూరు వాసవీ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్నామని ప్రిన్సిపల్ ప్రసాద్ తెలిపారు.

కోట శ్రీనివాసరావు మృతికి కళావేదిక సంతాపం

పెడన, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : సినీనటుడు కోట శ్రీనివాసరావు మృతికి ప్రముఖ నాటక సంస్థ కళావేదిక ప్రగాఢ సంతాపం తెలిపింది. సంస్థ అధ్యక్షుడు యక్కల నాగేశ్వరరావు మాట్లాడుతూ, కోట శ్రీనివాసరావు గొప్పనటుడన్నారు. ఆయనకు ఏ పాత్ర ఇచ్చినా పరకాయ ప్రవేశం చేసి అద్భుతమైన నటనను ప్రదర్శించి ప్రజల మన్ననలు అందుకున్నారని పేర్కొన్నారు.

స్మార్ట్‌మీటర్లను వ్యతిరేకిస్తూ రౌండ్‌టేబుల్ సమావేశం నేడు

మచిలీపట్నం టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా బుధవారం ఐక్య ప్రజావేదిక ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు ఐక్య ప్రజావేదిక నాయకులు బి.సుబ్రహ్మణ్యం తదితరులు మంగళవారం తెలిపారు. రౌండ్‌టేబుల్ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీలు, అనుబంధ సంఘాల నాయకులుసీఐటీయూ, ఏఐటీయూ నాయకులతో పాటు ఇతర కార్మిక సంఘాల నాయకులు పాల్గొంటారని సుబ్రహ్మణ్యం తెలిపారు.